


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 10.10.2025 | సంపుటి : 2 | సంచిక :247 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Friday | 10.10.2025 | volume : 2 | Issue : 247 | Pages : 8 | Cost : 2/-




విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# స్థానిక ఎన్నికల ప్రక్రియకు బ్రేక్



**బీసీ రిజర్వేషన్ల జీవో 9పై హైకోర్టు స్టే**

**నోటిఫికేషన్ పైనా స్టే విధిస్తూ ఆదేశాలు**

**కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం**

**రెండురోజుల పాటు హైకోర్టులో సమగ్ర వాదనలు**

**నోటిఫికేషన్ ఇచ్చాక కోర్టులు జోక్యం చేసుకోరాదన్న ఎజి**

హైదరాబాద్, అక్టోబర్ 9 : తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై హైకోర్టు స్టే విధించింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై విచారణను 4 వారాలపాటు వాయిదా

- మిగతా 2 లో..

## స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత: ఎస్ఈసీ ప్రకటన

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్లు ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమలు, నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ ఇచ్చేవరకు ఎన్నికల ప్రక్రియలన్నీ నిలిపివేసినట్లు ప్రకటించింది.




# భారత్ మూడో ఆర్థికశక్తి దిశగా..

**ట్రంప్ 'డెడ్ ఎకానమీ'కి యూకే ప్రధాని స్టార్మర్ కౌంటర్**

**ముంబైలో బ్రిటన్ ప్రధానికి మోడీ స్వాగతం**

**ఇరుదేశాల సంబంధాలు బలోపేతంపై స్టార్మర్ వ్యాఖ్యలు**



ముంబయి, అక్టోబర్ 9 : భారత పర్యటనలో ఉన్న యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గురువారం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. ముంబయిలోని రాజ్‌భవన్‌లో ఇరు దేశాధినేతలు సమావేశం జరిపారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్మర్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. ఈ ప్రయాణంలో తామూ భాగస్వామిగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. "భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి

- మిగతా 2 లో..



# ఇది సర్కార్ కాదు.. సర్కస్

**బస్‌ఛార్జీల పెంపుతో కుటుంబాలపై భారం**

**మహిళలకు ఉచితబస్సు..మగాళ్లపై ఛార్జీల భారం**

**బస్ భవన్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన**

**ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కెటిఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 9 : రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు

- మిగతా 2 లో..



03

## స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం

మైండ్ అప్లై చేయని నేతలు : రామ్‌చందర్ రావు



06

## సీజేఐ గవాయ్‌పై దాడి యత్నం కేసు

రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసిన బార్ అసోసియేషన్

సుప్రీంలో ఎంట్రీని నిషేధిస్తూ ప్రకటన విడుదల

# తాజా పరిస్థితులపై సీఎం రేవంత్ భేటీ

**అన్ని పరిస్థితులను ఎదుర్కొంటూ వెళ్తున్నాం**

**స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లకు పూర్తి సమయం కేటాయించాలి**

**న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీభవన్‌లో కమిటీ**

**స్థానిక సంస్థల ఎన్నికల పక్రియపై అన్ని పరిస్థితులను ఎదుర్కొని ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు. ఇన్‌ఛార్జి మంత్రులు.. ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలి. నామినేషన్ల పక్రియకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలి. నామినేషన్ల దరఖాస్తు నమూనా పత్రం క్షేత్రస్థాయికి పంపాలి. రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ఖరారు చేయాలి.**



హైదరాబాద్, అక్టోబర్ 9 : వారికి బీ ఫారం ఇవ్వాలి.. నో డ్యూ పత్రాలు ఇప్పించాలి. న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీ భవన్‌లో సమన్వయ కమిటీ ఉండాలి. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

- మిగతా 2 లో..



# నోటికాడ ముద్ద లాగేసుకున్నారు

**నోటిఫికేషన్ ఇచ్చాక స్టే ఎలా ఇస్తారు**

**సుప్రీం తీర్పును పట్టించుకోని హైకోర్టు**

**రిజర్వేషన్లపై సిఎం రేవంత్ స్పష్టం చేయాలి**

**లేకుంటే తెలంగాణ బంద్‌తో సత్తా చాటుతాం**

**బిజెపి ఎంపి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య**

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించడంపై బిజెపి రాజ్యసభ సభ్యుడు,.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఈ సందర్భంగా హైకోర్టు వద్ద ఆర్.కృష్ణయ్య మీడియాతో

- మిగతా 2 లో..



# మొక్కజొన్నకు మద్దతు ధర

## ప్రభుత్వమే సేకరించాలని నిర్ణయం

హైదరాబాద్,అక్టోబర్9 : తెలంగాణలో మొక్కజొన్న రైతులకు శుభవార్త. మొక్కజొన్న పంటను మద్దతు ధరకు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం రైతుల్లో ఆనందాన్ని నింపింది. మొక్కజొన్న పంట సేకరణ అంశంపై మంత్రి

- మిగతా 2 లో..

# రేవంత్ సర్కార్ చేతకానితనం

**రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాట**

**బిసి రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



న్యూఢిల్లీ,అక్టోబర్9 : కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని

- మిగతా 2 లో..

# రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**దశలవారీగా పనులు వేగవంతం చేయాలన్న భట్టి**

**మొదటి దశలో రూ.10,986 కోట్లతో నిర్మాణం: కోమటిరెడ్డి**



హైదరాబాద్,అక్టోబర్9 : రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులను దశలవారీగా వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. హ్యామ్ రోడ్ల నిర్మాణ పక్రియలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. రోడ్ల

- మిగతా 2 లో..



## స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం

**మైండ్ అప్లై చేయని నేతలు : రామ్‌చందర్ రావు**

**హైదరాబాద్, అక్టోబర్ 9 :** బీసీ రిజర్వేషన్లపై స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు పలుకుతోందని స్పష్టం చేశారు. బీసీల అంశాని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం వాడుకుంటోందని విమర్శించారు. గవర్నర్‌కి పంపిన తర్వాత బిల్లు కోసం 3 నెలల సమయం ఉంది.. ఎందుకు తొందర పడుతునారని సూచించారు. బిల్లు ఆమోదానికి 3 నెలల సమయం ఉండగా ఎందుకు బిల్లు తెచ్చారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందని రామ్‌చందర్ రావు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు కాబట్టే.. ఇలాంటి పరిస్థితి వచ్చిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని మాట్లాడుతారు తప్ప.. కనీసం రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ నేతలు మైండ్ అప్లై చేశారా.. అని ఎద్దేవా చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన బాధ్యత మీది. ఆర్డినెన్సు తెచ్చింది మీరు.. బిల్లు తెచ్చింది మీరు.. కానీ బీజేపీనీ అంటునారని రామ్‌చందర్ మండిపడ్డారు. మీరిచ్చిన హామీని మీరు అమలు చేయకుండా బిజెపిపై విమర్శలు ఎలా చేస్తారని అన్నారు.

## అక్రమంగా తిష్టవేసిన బంగ్లాదేశీయులు

**28మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 :** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం.. దేశంలోని అక్రమ వలసదారుల ఏరివేత పై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నివాసితుల సంక్షేమ సంఘాలను విదేశీ దేశాలకు స్థలాలను నియమించడం లేదా అద్దెకు ఇవ్వడం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 'అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల'పై పెద్ద ఎత్తున దాడిలో భాగంగా మూడు వేర్వేరు జిల్లాల్లో 28 మందిని అరెస్ట్ చేశారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా.. ఆగ్నేయ పోలీసు జిల్లాలో ఇద్దరు మైనర్లతో సహా 11 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకున్నారు. రాజధానిలో అక్రమంగా నివసిస్తున్న 13 మంది బంగ్లాదేశ్ జాతీయులను దక్షిణ జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు ప్రారంభంలో వాయువ్య జిల్లా నుండి నలుగురు బంగ్లాదేశ్ వలసదారులను అరెస్టు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశంలోని వివిధ నగరాల్లోని అక్రమ వలసదారులను గుర్తించే పనిలో పోలీసులు, ఇతర అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సౌత్ ఈస్ట్ డిస్ట్రిక్ట్ పోలీసులు 28 మంది అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను గుర్తించి అరెస్టు చేసింది. వారు భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించింది. విచారణలో వారంత పశ్చిమ బెంగాల్‌లోని ఖుల్నా సరిహద్దు ద్వారా ఇతర వ్యక్తులతో పాటు భారత దేశంలోకి అక్రమంగా ప్రవేశించారని ఒప్పుకున్నారని తెలిపారు.. మొత్తం 28 మంది అక్రమ వలసదారులను అరెస్ట్ చేసి.. ఇప్పుడు తాత్కాలిక నిర్బంధ కేంద్రంలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే వారిని దేశం నుంచి బహిష్కరించడానికి అవసరమైన చట్టపరమైన లాంఛనాలు జరుగుతున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటి వరకు మొత్తం 235 మంది అక్రమ బంగ్లాదేశీయులను బహిష్కరించినట్లు ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

## 2లక్షల లంచం డిమాండ్‌తో దొరికిపోయిన తాసిల్దార్

**నల్లగొండ, అక్టోబర్ 9 :** నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్ కోసం రూ. 2లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. తహసీల్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణ , మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ సిబ్బంది లంచాలకు పాల్పడితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## హైదరాబాద్‌లో ఈగిల్ టీమ్ దాడులు

**భారీ మొత్తంలో మాదకద్రవ్యాల పట్టివేత**

**హైదరాబాద్, అక్టోబర్ 9 :** హైదరాబాద్ నగరంలో పోలీసులు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 72 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దేశీయంగా రూ. 10 కోట్లు ఉంటుందన్నారు. నగరంలోని ఓ రసాయన పరిశ్రమలో తయారు చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. ఈ మాదకద్రవ్యాల తయారీలో ప్రధాన నిందితుడిగా శివరామకృష్ణ ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్ తయారీకి వాడిన ఫార్ములాను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఈగిల్ టీమ్ దాడిలో ఈ ఘటన వెలుగు చూసింది

# బీసీలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్

- జివో ఇస్తే నిలవదని తెలిసీ స్థానిక ఎన్నికల స్టంట్
- 42శాతం రిజర్వేషన్లకు ఎలా చట్టబద్ధత వస్తుందో తెలియదా
- ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలి
- మాజీ మంత్రి గంగుల కమలకార్ డిమాండ్



**హైదరాబాద్, అక్టోబర్ 9 :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేసిందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ జీఓ ద్వారా సాధ్యం కాదని, రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా చెప్పామని పేర్కొన్నారు. ఈ విషయంలో తమిళనాడు వెళ్లి కూడా అధ్యయనం చేసి వచ్చి వివరించామన్నారు. బీసీలను అవమానం చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. జీఓ న్యాయస్థానంలో నిలబడదని సీఎం, మంత్రులు, అందరికీ తెలుసని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. బీహార్, మహారాష్ట్ర ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు చేయవద్దని కోరారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న రేవంత్ రెడ్డి జీవో ఎందుకు ఇచ్చారు. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పిస్తామని జీఓ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. బీసీలు ఏం చేస్తారు లే అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెల్లని జీవో ఇచ్చిందని ఆరోపించారు. 1992లో తమిళనాడు సీఎం జయలలిత, ఎమ్మెల్యేలను ఢిల్లీ తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ల కోసం భీష్మించి కూర్చోవడంతో కేంద్రం దిగివచ్చి రాజ్యాంగ సవరణ చేయడం వల్ల తమిళనాడులో బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్ల కోసం రేపే ఢిల్లీ వెళ్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది హెచ్చరించారు. ఎన్నికలకు తొందర లేదు, రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే నిర్వహించాలన్నారు. చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి ఢిల్లీకి కదలాలని, రిజర్వేషన్ల అంశం తేలే వరకు హైదరాబాద్ రావద్దని సూచించారు. 56 సార్లు సొంత పనుల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం బీసీల కోసం ఒక్కసారి ఢిల్లీ వెళ్లి పోరాడాలని సూచించారు. రాహుల్ గాంధీని ఖుషీ చేసేందుకు, పదవులు కాపాడుకునేందుకు కాంగ్రెస్ నేతలు స్టంట్ చేస్తున్నారని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. రాష్ట్రపతిని కలవకుండానే ఢిల్లీలో ధర్నా చేసి హంగామా చేశారని ఆరోపించారు. చట్టం ప్రక్రియ పూర్తి కాకముందే జీవోఎలా తెస్తారని ప్రశ్నించారు. బీహార్‌లో ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ కోసం తెలంగాణలో బీసీలను బలి పెట్టి రోడ్లపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. స్టే వస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తూ వచ్చారు. హైకోర్టులో కేసు వేసింది కాంగ్రెస్ నేతలేనని పేర్కొన్నారు. ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్ అనేలా కాంగ్రెస్ వ్యవహరించిందని రవిచంద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్లను ఉపయోగించుకుందని విమర్శించారు. అమలు కాదని తెలిసి కూడా మోసపూరిత జీవో తీసుకొచ్చి ఆగం చేశారని మండిపడ్డారు. బీసీల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కూలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. బీసీల నోట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మన్ను కొట్టిందని, అంబేద్కర్ రాజ్యాంగం తమకు పట్టదు అన్నట్లుగా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని అన్నారు.

# బీసీలను 42శాతం పేరుతో కాంగ్రెస్ మోసం

- 50ఏళ్లుగా కాంగ్రెస్ బడుగులకు వ్యతిరేకమే
- మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్



**సూర్యాపేట, అక్టోబర్ 9 :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో పరోక్షంగా మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 50 సంవత్సరాలుగా బీసీలకు, బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకమన్నారు. కోర్టులో జీఓ 9 నిలబడదని తెలిసి కాంగ్రెస్ ప్రభుత్వం నటించిందన్నారు. ఆర్టికల్ 9 సవరించి పార్లమెంట్‌లో అనుమతి వస్తే తప్పా ఇది సాధ్యం కాదని బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతూనే ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చామని, ఏదో పోరాడమని చెప్పుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నటించిందన్నారు. కోర్టు స్థానిక సంస్థల నోటిఫికేషన్ నిలిపివేసిందని, దీనికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ అన్నారు. ఆరూ గ్యారంటీల మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో బీసీల మనోభావాలను, ఆత్మ గౌరవాన్ని అగౌరవ పరిచిందన్నారు. నోటిఫికేషన్ వెలువడడంతో ఎంతో మంది బీసీ అభ్యర్థులు డబ్బులు పోగొట్టుకున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతున్నట్లుగానే 42 శాతం రిజర్వేషన్ల సాధనకు పోరాడుతుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.

# గవర్నర్ సంతకం చేయకుంటే చట్టం అయినట్లే

- 57.6 శాతం ఉన్న జనాభాకు 42 శాతం రిజర్వేషన్లు
- తమిళనాడు ఘటనలను ఉదాహరించిన ఎజి

**హైదరాబాద్, అక్టోబర్ 9 :** గవర్నర్ బిల్లును పాస్ చేయకుంటే చట్టంగా మారినట్టేనని అడ్వకేట్ జనర్ సుదర్శన్ రెడ్డి ధర్మాసనం ముందు వాదించారు. ఇందుకు తమిళనాడు ఉదాహరణను ఆయన చూపారు. బీసీ కుల గణనపై అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని.. స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందని చెప్పారు. ఈ సర్వేపై ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని.. బీసీ జనభా 57.6 శాతం ఉన్నారంటే ఎవరూ కాదనడం లేదని.. 57.6 శాతం జనాభా ఉన్నా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏజీ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని, రాజకీయ వెనుకబాటుతనం ఉందని అసెంబ్లీ గుర్తించి తీర్మానం చేసిందని.. గ్రామీణ, పట్టణ సంస్థల్లో బీసీలకు 42 శాతం ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయం తీసుకుందన్నారు. గడువులోగా గవర్నర్ ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుందని.. తమిళనాడు ప్రభుత్వం, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నోటిఫై చేయాల్సిన అవసరం లేదని కోర్టుకు తెలిపారు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉందని.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉందన్నారు. ఇది రాష్ట్ర ప్రజల కోరిక అని.. దాన్ని అసెంబ్లీ ఆమోదించిందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో కులగణన సర్వే జరిగిందని.. సర్వేలో అన్ని కులాల లెక్కలు తేలాయన్నారు. బీసీ సబ్ కేటగిరిల వారీగా వివరాలు సర్వేలో తేలాయన్నారు. సర్వేలో అగ్రవర్ణాల లెక్కలు బయటకు వచ్చాయన్నారు. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించే.. అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉంది. ఇది రాష్ట్ర ప్రజల కోరిక. దాన్ని అసెంబ్లీ ఆమోదించింది. శాస్త్రీయ పద్ధతిలో కులగణన సర్వే జరిగింది. సర్వేలో అన్ని కులాల లెక్కలు తెలిశాయి. బీసీల్లోని సబ్ కేటగిరీల వారీగా వివరాలు సర్వేలో తేలాయి. అగ్రవర్ణాల లెక్కలు కూడా బయటకు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. కొందరు ఇది నోటిఫికేషన్ కాదంటున్నారు. అది తప్పని ఏజీ పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రతులను ధర్మాసనం ముందుంచారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత న్యాయస్థానాల జోక్యం ఉండబోదని వాదించారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. మరో న్యాయవాది రవివర్మ తన వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్‌గానే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# న్యాయవ్యవస్థలో బిసిలు రావాల్సి ఉంది

- తమవారు లేకపోవడంతోనే అన్యాయం
- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం
- మాజీ ఎంపి విహెచ్, ఆది శ్రీనివాస్‌ల ఆవేదన





**హైదరాబాద్, అక్టోబర్ 9 :** బీసీ రిజర్వేషన్ల అంశంపై మాజీ ఎంపీ వీ. హనుమంత రావు మాట్లాడుతూ...కోర్టు తీర్పు చాలా బాధ కలిగించిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ నోటి దగ్గరి ముద్దను లాక్కున్నారని మండిపడ్డారు. తారిఖ్ పే తారిఖ్ అని కోర్టు మరో తారిఖ్ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున చేయాల్సింది చేశామని చెప్పారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని.. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో బీసీలు వచ్చే వరకు తమకు అన్యాయం జరుగుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని కాంగ్రెస్ నేత, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'హైకోర్టు తీర్పుతో చాలా నిరాశ చెందాం. బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా సీఎం రేవంత్ రెడ్డి ఒంటరి పోరాటం చేశారు. కులగణనతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చాము. బీసీల నోటికాడి బువ్వ అందకుండా పోయింది.. అయినా మేం నిరాశ చెందం.. పోరాటం కొనసాగుతుంది. తప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి పెడుతాం. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు.. సీఎం రేవంత్ నాయకత్వంలో తప్పనిసరిగా రిజర్వేషన్లు సాధించుకుందాం' అని అన్నారు. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీఎంతో సమావేశం కానున్నారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. న్యాయనిపుణులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ స్టేపై సుప్రీం కోర్టుకు వెళ్లే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. హైకోర్ట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీసీ సంఘాల నేతలు, కార్యకర్తలు రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. 'వుయ్ వాంట్ జస్టిస్', 'బీసీ వ్యతిరేకుల్లారా ఖబడ్దార్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశంపై హై కోర్టు స్టే విధించిన నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థులు అయోమయంలో ఉన్నారు. పీసీసీ ఆదేశాలతో పలువురు స్థానిక నేతలు నామినేషన్ దాఖలు చేశారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న ఆందోళనలో ఉన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

- సిఎం రేవంత్‌తో చర్చించి తదుపరి కార్యాచరణ
- మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్య



**హైదరాబాద్, అక్టోబర్ 9 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్9 అమలుపై హైకోర్టు స్టే విధించిన క్రమంలో తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఉన్నత న్యాయస్థానం నిర్ణయంతో బీసీల నోటి వద్ద ముద్ద లాగేసినట్లయిందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. బీసీలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతామన్నారు. కోర్టు తీర్పు కాపీ చూసిన తర్వాత ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. హైకోర్టు తీర్పు కాపీ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తాం. సుప్రీం కోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటాం. కోర్టులో కేసులు వేయించింది భారత రాష్ట్ర సమితే. భాజపాతో కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంది. హైకోర్టు స్టే ఇవ్వకుండా ఉండేందుకు ఎంతో ప్రయత్నించాం అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు హైకోర్టు స్టే విధించడంపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. బీసీలకు 42 శాతంపై అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన కూడా స్టే విధించడం విచారకరమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్నాం.. కానీ కోర్టు తీర్పు ఊహించలేదని చెప్పారు. ఎక్కడ ఇబ్బంది లేకుండా కులగణన పూర్తి చేసి బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. బీసీల నోటి కాడ కూడు లాగేయడం శోచనీయమని పేర్కొన్నారు. నోటి కాడ ముద్ద ఎవరు లాగేసారో కోర్ట్ తీర్పు కాపీ వచ్చాక చెబుతామని హెచ్చరించారు. 42 శాతం బీసీల రిజర్వేషన్ కు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బీసీ బిడ్డలు అధైర్య పడాల్సిన అవసరం లేదని. .కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లును రెండు సభల్లో పాస్ చేసి గవర్నర్ కు పంపించామని.. గవర్నర్ బిల్లు పాస్ చేయకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైకోర్టులో స్టే రావడం బాధాకరం

- ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం
- ఉత్తర్వు కాపీలు అందాక తదుపరి కార్యాచరణ: పొన్నం



**హైదరాబాద్, అక్టోబర్ 9 :** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కాపీ అందిన తరువాత చట్టపరంగా, న్యాయపరంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరుపున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగిందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం కుల సర్వే నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ వేసి, సబ్ కమిటీ వేశామని గుర్తు చేశారు. అనంతరం కేబినెట్ ఆమోదించి.. శాసనసభలో చట్టం చేసి గవర్నర్‌కి బీసీ బిల్లును పంపడం జరిగిందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని మంత్రి పొన్నం పేర్కొన్నారు. హైకోర్టు స్టే విధిస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో జవాబు చెప్పాలని పొన్నం నిలదీశారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం డ్రామాలు

- 55 ఏళ్లు అధికారంలో ఉన్నా బిసిలకు మొండిచేయి
- సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు



**హైదరాబాద్, అక్టోబర్ 9 :** ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా? అంటూ ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మీ కాంగ్రెస్ నేతలు జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కొట్లాడాలని హితవు పలికారు. కలిసి వచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేశారు తప్పా.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారని.. బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మీ డ్రామాలు ఆపాలని.. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలని చెప్పారు. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పోరాటంలో అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించాలని.. ధ్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల కోసం గొంతెత్తుతుందని.. ఢిల్లీని నిలదీస్తుందన్నారు.

# సంక్షేమ హాస్టళ్ల తీరు మారేదెప్పుడు?



**సంక్షేమ హాస్టళ్లు ప్రాణాలు తీస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో పిల్లలు ఇటీవలి కాలంలో మృత్యు ఒడికి చేరారు. ఇందుకు రకరకాల కారణాలు ఉన్నాయి. అయితే అన్ని కారణాలు ఒకే విధంగా ఉన్నాయి. ఇందులో సర్కార్ వారి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. విద్యారంగం, సంక్షేమ హాస్టళ్ల విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఓట్ల పథకాలపై ఉన్న శ్రద్ధ హాస్టళ్లపై లేదు. పాఠశాలల అభివృద్ధిపై లేదు. వైద్యరంగం అభివృద్ధిపై లేదు. సర్కార్ వారి మాటలు నమ్మి పిల్లలను హాస్టళ్లకు పంపిన తల్లిదండ్రులు క్షోభకు గురవుతున్నారు.**

సాంఘిక, ఆర్థిక అసమానతల కారణంగా చదువులు అర్ధాంతరంగా ఆగిపోకూడదన్న సంకల్పంతో గురుకులాలు, వసతి గృహాలు ఏర్పాటయ్యాయి. ఆరోగ్యకరమైన, గౌరవ ప్రదమైన, స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో ఎదిగే అవకాశాలను, సౌకర్యాలను పిల్లలకు అందిస్తూ ఉన్నత విద్యావంతులను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అణగారిన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక అన్యాయం, దోపిడీల నుంచి వారిని రక్షించాల్సి ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటీకరణ విధానాలతో విద్య అంగడి సరుకుగా మారిపోయింది. రాజ్యాంగం నిర్దేశించిన కర్తవ్యాల అమలు ఊసేలేదు. సరళీకరణ విధానాలతో కుటుంబాలు గడవడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో పేద, అణగారిన వర్గాలకు చెందిన లక్షల మందికిపైగా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లే ఆధారమవుతున్నాయి. వీటికి సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం, డైట్ ఛార్జీలు చెల్లించకపోవడం ఆనవాయితీగా మారిపోయింది. మెనూ అమలు ఊసేలేదు. పౌష్టికాహారం అందకపోవడం, తాగునీటి కాలుష్యం, అపరిశుభ్రత తదితర కారణాల వల్ల తరచూ అతిసార, విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు గురవడం సర్వసాధారణమైపోయింది. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలు సైతం వెలుగుచూస్తున్నాయి. తెలంగాణలో ఘనత వహించిన కెసిఆర్ పాలనలో హాస్టళ్లు ఘనంగా వెలిగాయని, ఇప్పుడు హాస్టళ్లలో మరణ మృదంగం మోగుతోందని ఇటీవలి కాలంలో కెటిఆర్ బృందం ఘోషించింది. మరి పదేళ్లలో హాస్టళ్లు బాగుంటే..బాగుచేసి ఉంటే ఇప్పుడే ఎందుకు ఈ అధ్వాన్న పరిస్థితి వచ్చిందో నాటి బిఆర్ఎస్ పాలకులు చెప్పలేకపోయారు. పదేళ్ల అధికారం మత్తులో అంతా బాగుందని ప్రచారం చేసుకున్నారు. బంగారు పళ్లెంలో పిల్లలు భోంచేస్తున్నారని బిల్డప్ ఇచ్చారు. ఇక ఇప్పుడ రేవంత సర్కార్ కూడా అంతకు మించి అన్నట్లుగా వ్యవహరిస్తోంది. రకరకాల స్కూళ్ల పేరుతో ఊదరగొడుతోంది. స్కూళ్లనే అభివృద్ధి చేసి,పిల్లలను తల్లిదండ్రులకు చేరువ చేసి,హాస్టళ్లను తగ్గించాలన్న ప్రణాళిక ఉన్నట్లు చెప్పారు. కానీ అలా జరగలేదు. స్కూళ్లలోనే హాస్టల్ వసతులు కల్పించి, పిల్లలను తల్లిదండ్రులకు చేరువ చేస్తామన్న ఆలోచన బాగానే ఉన్నా అదీ కార్యరూపం దాల్చలేదు. కస్మోటిక్ ఛార్జీలు పెంచామని చెప్పారు. కానీ ఏ హాస్టల్లో ఏ మేరకు సౌకర్యాలు ఉన్నాయో గుర్తించడం లేదు. అందరి సంక్షేమమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వాలు అధికారం అనుభవించడం కోసం నానా కబుర్లు చెప్పి కాలం గడిపేస్తున్నారు. చంద్రబాబు సమీక్షించని రంగం లేదు.

అలాగే అడుగు ముందుకు పడిన దాఖలాలు కూడా లేవు. దీంతో హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటున్న చిన్నారుల ఆలనా పాలనా పట్టించుకునే వారే లేకుండా పోయారుజ ఏళ్ల తరబడి కలుషిత నీరు తాగుతున్నా, మెనూ ప్రకారం ఆహారం అందకపోయినా, హైకోర్టు చీవాట్లు పెట్టినా పరిస్థితుల్లో మార్పేమీ రావడం లేదు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇటీవల ఓ గిరిజన హాస్టల్లో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. మంత్రులు వెళ్లి పరామర్శించారు. హాస్టళ్లను తనిఖీ చేశారు. కానీ మార్పు లేదు. పార్వతీపురం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత నీరు తాగడం వల్లే 9, 10 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న 611 మంది బాలికల్లో 140 మంది పచ్చకామెర్లకు గురై జిల్లా కేంద్ర, విశాఖ కెజిహెచ్లలో చికిత్స పొందుతున్నారు.విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు, బాత్రూమ్లు లేకపోతే ఎలా? అవసాన దశలో ఉన్న హాస్టల్ భవనాలు కూలిపోతే విద్యార్థులేం కావాలి? మన ఇంట్లో పిల్లల్ని నేలపై పడుకో బెడతామా? ఏటా ప్రభుత్వం కేటాయించే కోట్ల రూపాయలు ఏమవుతున్నాయి? అన్నదానికి సమాధానం లేదు.పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు లేదనడానికి కురుపాం హాస్టల్ దుస్థితే నిదర్శనం. ఆర్ఒ సిస్టమ్ పాడై, పరిశుభ్రమైన తాగునీరు అందుబాట్లో లేకపోవడమే విద్యార్థినుల ప్రాణాంతక పచ్చకామెర్లకు ప్రధాన కారణం. పిల్లలు ఇళ్ల వద్ద చనిపోతే ప్రభుత్వానిది బాధ్యతెలా అవుతుందని, నష్టపరిహారం ఎలా ఇస్తామని పార్వతీపురం జిల్లాకే చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి వ్యాఖ్యానించారు.

కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం వల్లే వారు హాస్టళ్లలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్న విషయాన్ని పట్టించుకోక పోవడం సమంజసమా? బాధితులు, గిరిజనులు డిమాండ్ చేసిన విధంగా? మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించడంతోపాటు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు ఉన్నాయని, పశువులకు కూడా హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల సిఎం చ చంద్రబాబు ప్రకటించారు. పిల్లల హాస్టళ్లను మెరుగుచేయకుండా పశువులకు హాస్టల్ అనడం సమంజస మేనా? ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా నవతరాన్ని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగితేనే ఇటువంటి పరిస్థితులను అధిగమించగలం. ఆ దిశగా ప్రజలంతా సంఘటితంగా ఒత్తిడి తేవాలి. ప్రభుత్వాలు కూడా ఇంకా ఎంతోకాలం మభ్య పెట్టే పనులు మానుకోవాలి. స్కూళ్లను బలోపేతం చేసే యత్నాలు ముమ్మరం చేయాలి. నిధులు కేటాయించాలి. అప్పుడే భావితరం ఆరోగ్యవంతంగా చదువుకుని సమాజంలోకి అడుగపెట్టగలదు.

## మోదీ-ట్రంప్ భేటీతోనే

# వాణిజ్య చర్చలు కొలిక్కి..?



**న్యూఢిల్లీ :** భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నాయి. దీనిపై ఇరుదేశాల ప్రతినిధులు పలుమార్లు భేటీ అయినా.. ఇప్పటివరకు ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే, ఈ ప్రతిష్టంభన తొలిగి ట్రేడ్ డీల్ ఓ కొలిక్కి రావాలంటే భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ తప్పనిసరి అని అగ్రరాజ్యం భావిస్తోంది. దీనిపై ఇప్పటికే వాషింగ్టన్ నుంచి భారత్కు సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. "వాణిజ్య ఒప్పందం ప్రకటనకు ముందు ప్రధాని మోదీతో భేటీ కావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన కార్యవర్గం భావిస్తోంది. కానీ, భారత విధానాల ప్రకారం అది సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే.. ఒకసారి ట్రేడ్ డీల్ కుదిరిన తర్వాతే ఇరు దేశాధినేతలు మాట్లాడుకుంటారు. కానీ, ఒక్కోసారి పరిస్థితులు తారుమారు కావొచ్చు కూడా. ఎందుకంటే చాలాకాలంగా అనుసరిస్తున్న ప్రోటోకాల్స్ను ట్రంప్ చాలాసార్లు పక్కనబెట్టేశారు" అని అధికారులు పేర్కొన్నట్లు సదరు కథనం వెల్లడించింది. వాస్తవానికి అమెరికాతో వాణిజ్య చర్చలకు భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వం వహిస్తున్నారు. ఇటీవల గోయల్ బృందం అగ్రరాజ్యానికి వెళ్లి అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రోర్తో పలుమార్లు సమావేశాలు జరిపారు. అయితే, ఇప్పుడు ట్రంప్-మోదీ కూడా దీనిపై భేటీ కావాలని అమెరికా అభిప్రాయపడుతోంది. భారత్కు యూఎస్ రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ దీనిపై మన ప్రభుత్వంతో చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. అక్టోబరు 26-28 మధ్య మలేసియాలోని కౌలాలంపూర్ వేదికగా ఆసియాన్, ఈస్ట్ ఇండియా నేతల సదస్సు జరగనుంది. ఈ సదస్సు అనుబంధంగా ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, ఈ సదస్సుకు మోదీ పర్యటన ఇంకా ఖరారు కాలేదు. దీనిపై చర్చలు జరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. ఒకవేళ ప్రధాని మోదీ మలేసియా వెళ్తే.. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరుదేశాల నేతలు మొదటిసారి భేటీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్పై అమెరికా 50శాతం టారిఫ్లు కొనసాగుతోన్న సంగతి తెలిసిందే.

## తప్పులను కప్పిపుచ్చుకునే యత్నం

### సిఎం రేవంత్పై అర్వింద్ ఫైర్



**హైదరాబాద్, అక్టోబర్ 9 :** సిఎం రేవంత్ రెడ్డి బీసీ రాజకీయాలను ఉపయోగించి దద్దమ్మ పాలనను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ అరవింద్ ధర్మపురి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఒక విధంగా మాటలు చెప్పి, తర్వాత మరో విధంగా ప్రవర్తించడం రేవంత్ రెడ్డికి కొత్త విషయమేమీ కాదు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాజకీయాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ఎందుకు సక్రమంగా వ్యవహరించలేదని అరవింద్ ప్రశ్నించారు, కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ను లోపల ఎందుకు ఉంచలేదు, కేటీఆర్ను లోపల ఎందుకు ఉంచలేదు, కవిత రాజీనామాను ఎందుకు ఆమోదించకపోతున్నారని ప్రశ్నించారు. హరీష్ పాల వ్యాపారం, సంతోష్ టానిక్ సంబంధిత అంశాలను, అలాగే కల్వకుంట్ల కుటుంబంతో చేసిన ఒప్పందం బయటకు రాకుండా చేయడానికి రేవంత్ బీసీలను రాజకీయ వ్యూహంగా వాడుతున్నారని ఆయన ఆరోపించారు. మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదు. తమిళనాడులో తెచ్చుకున్నప్పుడు కూడా రేవంత్ కు తెలియలేదు. ఇప్పుడు బీసీలను రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఆడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## శ్రీలంక నేవీ అదుపులో 30మంది తమిళ జాలర్లు

### తమ జలాల్లోకి ప్రవేశించడంతో అదుపులోకి తీసుకున్న నేవీ

**కొలంబో, అక్టోబర్ 9 :** అంతర్జాతీయ జల్లాల్లో వేటాడారనే ఆరోపణలతో శ్రీలంక నేవీ 30 మంది తమిళనాడు మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. నాలుగు ట్రాలర్లను స్వాధీనం చేసుకున్నారని అన్నారు. తర్వాత వారిని అధికారికంగా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. తమిళనాడు మత్స్యశాఖ సమాచారం ప్రకారం.. బుధవారం ఉదయం రామేశ్వరం జెట్టీ నుండి 339 పడవలకు టోకెన్లు జారీ అయ్యాయి. తంగచిమడం, రామేశ్వరం మరియు ఇతర ప్రాంతాల నుడి మత్స్యకారులు సముద్రంలోకి ప్రవేశించారు. రాత్రి 8.00 గంటల ప్రాంతంలో, పాక్ సరిహద్దు వెంబడి నిఘా విధుల్లో ఉన్న శ్రీలంక నేవీ సిబ్బంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుని, వారి పడవలను, వారు పట్టిన చేపలను స్వాధీనం చేసుకున్నారు. వారందరినీ శ్రీలంక నావల్ పోర్ట్కు తీసుకువెళ్లి, తర్వాత అరెస్ట్ చేశారు. ఈ అరెస్టులను మత్స్యకారుల నేత జేసు రాజా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే శ్రీలంక ప్రభుత్వంతో మాట్లాడి వారి విడుదలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఇది మత్స్యకారుల మనుగడ, జీవనోపాధికి సంబంధించిన ప్రశ్న అని, మౌన ప్రేక్షకుల్లా వ్యవహరించడం సరికాదని కేంద్రాన్ని నిలదీశారు. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, ఓడలతో సహా వారిని వెనక్కి తీసుకురావాలని మరో మత్స్యకార నేత అన్నారు.

## బిసి సంఘాల నేతల ఆందోళన

**హైదరాబాద్,అక్టోబర్9 :** బిసి రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధించడంతో హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ కోర్టు వద్ద బీసీ సంఘాలు నేతలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే బీసీలకు అన్యాయం జరిగింది అని బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. బీసీలకు పదవులు వస్తుంటే అగ్రకులస్తులు ఓర్వలేకపోతున్నారు అని వారు మండిపడ్డారు. బీసీల నోటి కాడ ముద్దను లాక్కున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పదవులు మొత్తం అగ్రవర్ణాలకే. కనీసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులైనా బీసీలకు దక్కొద్దా..? అని ప్రభుత్వాన్ని బీసీ నేతలు నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. జీవో అమలును నిలిపివేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలకు దాఖలుకు పిటిషనర్లకు 2 వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు కోర్టు వాయిదా వేసింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై రెండు రోజుల పాటు హైకోర్టులో సుధీర్ఘ విచారణ కొనసాగిన సంగతి తెలిసిందే. ఏజీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ బీసీ జనగణన నిర్వహించాలనే నిర్ణయం తీసుకుందని తెలిపారు. సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 57.6 శాతం ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఏజీ తెలిపారు. ఈ తీర్మానం సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైన అడుగని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలపకపోయినా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అది చట్టబద్ధమైనదే అని ఏజీ పేర్కొన్నారు.

## రూ.18 కోట్ల ఘరానా మోసం

**పటాన్చెరు:** వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్రెడ్డి పేరు చెప్పి విద్య అనే మహిళ మోసం చేసిందంటూ బాధితులు పటాన్చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.18 కోట్ల మేర మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెవిరెడ్డి పీఏ నుంచి రూ.2 వేల కోట్లు వస్తున్నాయని, కంటైనర్లు కొనాలని కొంత మంది వద్ద, బంగారం ఇస్తానని చెప్పి మరికొంత మంది దగ్గర ఆమె డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. డబ్బులు వసూలు చేశాక సికింద్రాబాద్ పరిధిలోని వారాసిగూడ నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్చెరుకు మకాం మార్చిందని వాపోయారు. డబ్బులు ఇవ్వాలని పలుమార్లు అడగ్గా.. అందర్నీ గురువారం రావాలని చెప్పి.. వచ్చిన వారందర్నీ గదిలో పెట్టి దాడి చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడిలో కమలమ్మ అనే బాధితురాలికి తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## వారిని జిల్లా న్యాయమూర్తులుగా నియమించొచ్చు

### సివిల్ జడ్జీలకు సుప్రీం గుడ్న్యూస్

**న్యూఢిల్లీ :** ఏడేళ్లపాటు న్యాయవాదిగా ప్రాక్టీసు చేసిన అనంతరం కింది కోర్టుల జడ్జీలుగా నియమితులైన వ్యక్తులు న్యాయవాదుల సంఘం (బార్) కోటా కింద జిల్లా జడ్జీలుగా నియామకానికి అర్హులా, కాదా అనే విషయంపై సుప్రీంకోర్టు గురువారం తీర్పును వెలువరించింది. జిల్లా న్యాయమూర్తులుగా సివిల్ జడ్జీలుగా పరిగణించొచ్చని తెలిపింది. న్యాయవాదుల కోసమే ఉన్న ప్రత్యేక నియామక ప్రక్రియ కింద జ్యుడీషియల్ అధికారులు జిల్లా న్యాయమూర్తులుగా నియమితులు కావొచ్చని వెల్లడించింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, హైకోర్టులతో సంప్రదించి, మూడు నెలల వ్యవధి లోపు ఈ తీర్పునకు అనుగుణంగా నిబంధనలను సవరించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా జడ్జీల నియామకాలపై విస్తృత ప్రభావం చూపనుంది. కొన్నేళ్లపాటు న్యాయవాదులుగా ప్రాక్టీసు చేశాక న్యాయాధికారులుగా నియమితులయ్యే సివిల్ జడ్జీలు కూడా న్యాయవాద సంఘాల కోటా కింద జిల్లా జడ్జి నియామక పరీక్షకు హాజరయ్యేలా అనుమతి కల్పించాలంటూ సుప్రీంకోర్టులో 30కి పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. జిల్లా జడ్జీల నియామకాన్ని నిర్దేశించే 233వ రాజ్యాంగ అధికరణంపై వచ్చిన వ్యాఖ్యానాలను పరిశీలించింది. జిల్లాల కిందిస్థాయి న్యాయవ్యవస్థ ఉద్యోగాల్లో సత్వర ఎదుగుదల లేక స్తబ్ధత నెలకొందని గత విచారణలో సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. సివిల్ జడ్జిగా నియమితుడైన వ్యక్తి ప్రమోషన్ సాధించాలంటే 15 నుంచి 16 సంవత్సరాల పాటు వేచి ఉండాలన్న భావన ప్రబలిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నాడు వ్యాఖ్యానించారు. రిటైరయ్యే వయసొచ్చినా జిల్లా జడ్జీలయ్యే అవకాశం లేని కారణంగా పలువురు అద్భుత ప్రతిభా పాటవాలు కలిగిన అభ్యర్థులు సివిల్ జడ్జీలుగా చేరిన కొన్నేళ్లకే ఉద్యోగం నుంచి తప్పుకొంటున్నారని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో తాజా తీర్పు వెలువరించింది.



## దగ్గు మందు వివాదం..

### పిల్పై విచారణకు సుప్రీం అంగీకారం

**న్యూఢిల్లీ :** దగ్గు మందు తాగిన చిన్నారులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురి చేసింది. 'కోల్డ్రిఫ్' దగ్గుమందు కారణంగా మధ్యప్ర దేశ్లో పలువురు పిల్ల లు ప్రాణాలు కోల్పో యిన సంగతి తెలిసిం దే. ఈ ఘటనకు సంబంధించి సీబీఐ విచారణ కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దాన్ని విచారించేందుకు తాజాగా న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిల్పై తక్షణమే విచారణ జరపాల్సి ఉందని పిటిషనర్, న్యాయవాది విశాల్ తివేరి పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జయ్ భూయాన్, జస్టిస్ కె.వినోద్చంద్రన్లతో కూడిన ధర్మాసనం న్యాయవాది అభ్యర్థనలను పరిగణలోకి తీసుకుంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపేందుకు అంగీకరించింది.

### కోల్డ్రిఫ్ యజమాని అరెస్టు

ఈ దగ్గు మందు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కోల్డ్రిఫ్ సిరప్ తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా యూనిట్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఫార్మా యజమాని రంగనాథన్ను బుధవారం అర్ధరాత్రి చెన్నైలో అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. అనంతరం కాంచీపురంలోని అతని ఫ్యాక్టరీకి తీసుకెళ్లి విచారించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈ కోల్డ్రిఫ్ దగ్గు సిరప్లు మధ్యప్రదేశ్తో పాటు ఒడిశా, పుదుచ్చేరిలకు కూడా సరఫరా చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

## ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందం

- ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని ట్రంప్ వెల్లడి
- ట్రంప్ చొరవను స్వాగతించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 :** గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని, ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని స్వాగతించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వానికి ఇది అద్దంపడుతోందన్నారు. బందీలను విడుదల చేయడం, గాజా ప్రజలకు మెరుగైన మానవతా సాయం అందేలా చూడటం వల్ల శాశ్వత శాంతికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ÷ుసబీపూ) 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా పలు దేశాలు ఆహ్వానించాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగుపడిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. గాజా మొదటి దశ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్లు అంగీకరించినందుకు గర్వంగా ఉంది. ఈ నిర్ణయంతో హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుందని ప్రకటించారు. అలాగే సోమవారం బందీలు విడుదల కావొచ్చని చెప్పారు. అలాగే ఈ విషయంపై ఫోన్ కాల్లో ట్రంప్ మాట్లాడుతుంటే బందీల కుటుంబాలు ఆసక్తిగా వింటున్నట్లు ఉన్న ఒక వీడియోను వైట్హౌస్ పోస్ట్ చేసింది. శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాల పూర్తి ఉపసంహరణ, మానవత సాయానికి అనుమతి, ఖైదీల మార్పిడి చోటుచేసుకోనుందని వెల్లడించింది. ఈ ఒప్పందం వేళ.. రష్యా స్పందించింది. ట్రంప్ అత్యున్నత ప్రతిపాదనలను చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ అభివర్ణించారు. ఒప్పందంలో నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, గాజాలోకి అన్నిరకాల నిత్యావసరాల సరఫరాలను కొనసాగించాలని ఐరాస పేర్కొంది. ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు 'పీస్ ప్రెసిడెంట్' అని వైట్హౌస్ అభివర్ణించింది. ఆయన చేతిలో ఒక ÷ల్ పట్టుకొని నడిచివస్తోన్న ఫొటోను షేర్ చేసింది. ఇదిలాఉంటే.. తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఉన్న ఆశలను ట్రంప్ మరోసారి వ్యక్తంచేశారు. శాంతి బహుమతి విజేతను నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించనున్న నేపథ్యంలో దానిగురించి శ్వేతసౌధంలో రిపోర్టర్లతో మాట్లాడారు. నోబెల్ సంగతి తనకు తెలియదని, అయితే ఏడు యుద్ధాలు ఆపానని, ఎనిమిదో యుద్ధాన్ని కూడా ఆపబోతున్నట్లు చెప్పారు.



## సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

**మనకెందుకులే అనుకోకుండా తన వంతు సహాయంగా ముందడుగు**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండలంలోని అలంఖాన్ గూడ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ శివారెడ్డి తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. అలంఖాన్ గూడ గేటు నుండి గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం గమనించిన మీడియా ప్రతినిధి శివారెడ్డి తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. ఇలాంటి సమస్యను పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడమే కాకుండా ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయని ఆయన వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం బాధాకరంగా ఉందని శివారెడ్డి వాపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో గ్రామాలను పట్టించుకునే నాథుడే లేడని, గ్రామ స్పెషల్ ఆఫీసర్స్ ఉన్న గ్రామ సమస్యలపై వారికి అవగాహన లేకపోవడం ఈ సమస్యలకు మరో కారణమని ఆయన తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతల మయమైన రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపించాలని శివారెడ్డి కోరారు.



## క్రీడలు మానసికోల్లాసంతో పాటు, శరీరత్వానికి దోహదపడతాయి

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి**

**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ మండల ప్రభుత్వ మైదానంలో ఎస్ఎంఆర్ ట్రస్ట్ స్పాన్సర్ చేస్తున్న 69వ మండల స్థాయి ఎస్ జి ఎఫ్, కోకో, కబడ్డీ, వాలీబాల్ (జూనియర్, సీనియర్ లెవెల్) గేమ్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు, విద్యార్థుల మధ్య స్నేహభావానికి పునాది వేస్తాయని తెలిపారు. విద్యార్థి దశ నుండి ప్రతి విద్యార్థి ఆటలలో చురుగ్గా పాల్గొని, శరీర ధృఢత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, వెంకట్ రెడ్డి, గుండాల అశోక్, సర్దార్ నగర్ మార్కెట్ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డి, రవీందర్ నాయక్, నర్సింలు, శ్రీనివాస్ గౌడ్, లింగం, నాయకులు ప్రభాకర్ రెడ్డి, నరసింహారావు రాహుల్, శేఖర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్, యాదయ్య, రఫిక్, మహేష్, రమేష్, శ్రీనివాస్, సూర్య, రఘు, విజయ్ పార్టీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ కి బీసీ సంఘాల సంపూర్ణ మద్దతు



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** బి సి బిడ్డ నవీన్ యాదవ్ కి కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే పార్టీ టికెట్ కేటాయించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మిత్ర బృందం. బీసీల ముద్దుబిడ్డ నవీన్ యాదవ్ కు కాంగ్రెస్ హై కమాండ్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే పార్టీ టికెట్ కేటాయించడం సంతోషదాయకం. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ బిసి బిడ్డకు నవీన్ యాదవ్ కి ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం గొప్ప విశేషం. చిన్న శ్రీశైలం యాదవ్ పుత్రుడైన నవీన్ యాదవ్ ఇంతకుముందు కూడా ఎమ్మెల్యేకు పోటీ చేయడం జరిగింది. సామాజిక సేవలో తన నియోజకవర్గానికి చేసిన సేవలు చిన్న శ్రీశైలం యాదవ్, పుత్రుడైన నవీన్ యాదవ్ కి ప్రజా బాహుళ్యం లో మంచి పేరు ఉంది బీసీ ఉద్యమ సందర్భంగా జరుగుతున్న ఈ ఎన్నిక అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయం. ముస్లిం సోదరులందరూ కూడా తమ పూర్తి మద్దతు నవీన్ యాదవ్ కి తెలపడం జరిగింది. నవీన్ యాదవ్ ప్రజల మనిషి పేదల గుండెల్లో ఉన్న వ్యక్తి ఆయనకు గెలిపించటానికి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీస్ ప్రజలందరూ ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీస్ వాళ్ళతో ఉన్న సంబంధాల మూలంగా నూటికి నూరు శాతం గెలుస్తున్నాడు. బీసీ సంఘాలు కుల సంఘాలు అందరు కూడా నవీన్ యాదవ్ కి పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలుపడం జరిగింది. బేర రామచంద్ర యాదవ్ తో పాటు యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి మహేందర్ యాదవ్, యూత్ అధ్యక్షులు అందెం కుమార్ యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్నే సాయన్న ముదిరాజ్, వనపర్తి జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు మధు యాదవ్, గుడుగే శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్, సినిమా ఆర్టిస్ట్ లు అభిమానులు పాల్గొన్నారు.

### మున్సిపల్ రాష్ట్ర మహాసభలను

# జయప్రదం చెయ్యాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్**




**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** ఈనెల 14, 15న మున్సిపల్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. గురువారం రోజు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ....ఈనెల 14,15 తేదీలలో రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్ లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఐదవ రాష్ట్ర మహాసభ జరుగుతుందని, ఈ మహా సభలను కార్మికులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రెండు రోజులు పాటు చర్చించి, కార్మికుల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు రత్నం, అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, నరసింహ, అంజయ్య, రామచందర్, శివ, లక్ష్మమ్మ, సాలమ్మ, లతా తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

**ప్రముఖ వ్యాపారవేత్త యమ ప్రభాకర్**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రముఖ వ్యాపారవేత్త,యమ ప్రభాకర్ తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బాలభవన్ లో ప్లాస్టిక్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ క్లాత్ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్లాస్టిక్ సముద్రాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయన్నారు.తద్వారా సముద్ర జీవులకు హాని కల్గిస్తున్నాయన్నారు.తాబేళ్లు, సీల్స్,పక్షులు, జంతువులు ప్లాస్టిక్ వ్యర్థాలలో చిక్కుకుని గాయాలు, మరణానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అనేక దేశాలు ప్లాస్టిక్ సంచులు,సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నిషేధించాయన్నారు.ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే రీసైకలింగ్ చేస్తున్నారన్నారు.చాలా వరకు ప్లాస్టిక్‌ను పూడ్చి పెట్టడం,కాల్చి వేయడం చేయాలన్నారు. ప్రతి ఏటా దాదాపు 8 మిలియన టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు ఒక ప్లాస్టిక్ సంచి సగటున 12 నిమిషాలు ఉపయోగించబడుతుందన్నారు. కానీ కుళ్లిపోవడానికి 1000 సంవత్సరాలు పడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషానికి 1 మిలియన ప్లాస్టిక్ బాటిళ్లు కొనుగోలవుతున్నాయన్నారు. 2050 నాటికి సముద్రంలో ప్లాస్టిక్ బరువు అన్ని చేపల బరువును మించిపోతుందన్నారు.బాధ్యత గల పౌరులు ఒక సారి ఉపయోగించే ప్లాస్టిక్‌లను తిరస్కరించాలని తెలిపారు. పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం ద్వారా ప్లాస్టిక్ వినియోగం పూర్తి గా తగ్గిపోతుందన్నారు.ప్రతి ఒక్కరూ పెళ్లిలకు, పుట్టినరోజు వేడుకలకు వచ్చిన వారికి చేతి సంచులను ఇవ్వడం వలన ఈ తరాన్ని,వచ్చే తరాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బండి రాధాకృష్ణ రెడ్డి, వీరు నాయుడు, అరుంధతి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మల్కంచెరువు కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం, గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని మల్కం చెరువు కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట 09వ తేదీ గురువారం నుండి11వ తేదీ శనివారం రోజు వరకు అంగరంగ వైభవంగా పూజలు జరుగుతాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వేద శాస్త్ర పండితులచే అంగరంగ వైభవం గా నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. కావున గ్రామస్తులు, పెద్దలు, చిన్నలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులై ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వుండేలా అమ్మవారి ఆశీస్సులు పొందే అదృష్టం నోచుకోగలరని రాయదుర్గం బస్తీ ప్రజలు కోరుతున్నారు. అలాగే అమ్మ వారి ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ఆర్డీవో, కలెక్టర్, ఎం ఆర్. ఓ, పోలీసు ఉన్నత అధికారులు, సిబ్బంది కి ఈ సందర్భంగా రాయదుర్గం ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. రాయదుర్గం నందు నూతనంగా నిర్మితమైన దేవాలయంలో, 10-10-2025 శుక్రవారం ఉదయం 6 గం.ల సాయంత్రం పూజా శయ్యాదివాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుగును. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర, దక్షిణాయము, శిరదృతువు ఆశ్వయుజ బహుళ పంచమి శనివారం రోహిణి నక్షత్రయుక్త వృచ్చిక లగ్నమందు 11-10-2025 ఉ. 9.05 ని.లకు శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ట జరుపబడును ఈ దైవ కార్యక్రమం నందు భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరు అని రాయదుర్గం వాస్తవ్యులు తెలిపారు. 11-10-2025 శనివారంఉదయం 6 గంటలకు గణపతి పూజ, మండప పూజ, హోమం శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనం అభిషేకం, హారతి, అర్చన, నివేదన, మంత్రపుష్పం పూర్ణాహుతి హోమం, తీర్థప్రసాద వితరన 4 గంటలకు బోనాల కార్యక్రమం జరుగుతుంది. గణపతి పూజ, మండప పూజ, హోమం, ద్విధివాసం, హోమం, పుష్పాదివాసం హోమం ఫలాదివాసం హోమం, హారతి తీర్థప్రసాద వితరణ లో భక్త మహాశయులు పాల్గొనీ విజయవంతం చేయవలసింది గా రాయదుర్గం వాస్తవ్యులు ఈ సందర్భంగా తెలిపారు.

# నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిధిలోని మోమిన్ పేట్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్థానిక ఎన్నికల సందర్భంగా రెండు విడతలుగా జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 11 మండలాల్లో జడ్పిటిసి, 115 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపీటీసీ నామినేషన్లు వేసే క్రమంలో ఏవైనా సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సిబ్బందిని కూడా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడతలో నిర్వహించే స్థానిక ఎన్నికలకు 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు గడువు ఉందని ఆయన తెలిపారు. జడ్పిటిసి, ఎంపిటిసి నామినేషన్ల రిటర్నింగ్ అధికారుల గదులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ నామినేషన్ల ప్రక్రియను సందర్శించినప్పుడు మోమిన్ పేట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం, తహసిల్దార్ రవీందర్, ఎంపీడీఓ విజయలక్ష్మి, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

# ట్రంప్ వర్సెస్ పోప్..

**వలసలపై భిన్నాభిప్రాయాలు**

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. వలసదారులను దేశం నుంచి పంపిం చేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అమెరికాలో వలసలకు మద్దతుగా పోప్ లియో గళం విప్పారు. ఈ సందర్భంగా వలసదారులకు అమెరికా బిషప్‌లు మద్దతుగా ఉండాల ని పిలుపునిచ్చారు. బుధవా రం లియో వాటికన్‌ను సంద ర్శించారు. ఈసందర్భంగా అమెరికన్ బిషప్‌లతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వలసదారుల నుంచి వచ్చిన వందలాది లేఖలు, పలు వీడియోలను పోప్ చూశారని ఎల్ పాసో బిషప్ మార్క్ సీట్జ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలసదారులకు సాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న కేథలిక్ నాయకులకు లియో మద్దతు తెలిపారన్నారు. అమెరికాలోని కేథలిక్ నాయకులు ట్రంప్ అణచివేతలను ఖండించారు. ఇది కుటుంబాలను విభజించి, భయాలను రేకెత్తిస్తుందన్నారు. ఇలా కఠినంగా వ్యవహరించడం వల్ల వారి జీవితాలపై దీర్ఘకాలిక ప్రభావాలు చూపుతాయని సీట్జ్ తెలిపారు. లియో సొంత నగరం షికాగో. ఇటీవల ఇక్కడి వలసదారులపై ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో వలసదారులకు మద్దతు పలకాలని లియో పిలుపునివ్వడం గమనార్హం.



### ఓడబలిజ సేవా సంఘం

# ఆత్మీయ సమ్మేళనం

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రం,ధర్మారం గ్రామంలో ఓడబలిజ సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు,తెలంగాణ రాష్ట్ర ఓడ బలిజ సేవా సంఘం అధ్యక్షులు దర్ర దామోదర్, మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ, అల్లుడి నోట్లో శని ఉన్నట్టు దశాబ్దాల కాలం నాటికీ ఓడ బలిజ కులస్తులకు అన్యాయం జరుగుతూనే ఉందని, వాజేడు మండలంలో బీసీ జనరల్ సీటు జడ్పిటిసికి రావటంతో అనేక రాజకీయ పార్టీలు బీసీలను దృష్టిలో పెట్టుకొని వాజేడు మండలంలో అత్యధిక జనాభా కలిగి ఉన్నటువంటి ఓడబలిజ కులస్తులకు జడ్పిటిసి టిక్కెట్ ఇచ్చి ఓడ బలిజలకు కులస్తులకు న్యాయం చేయలని,15 సంవత్సరాల క్రితం రెండు పార్టీలు ఓడ బలిజ కులస్తులకు టిక్కెట్ ఇస్తే అందులో నుండి ఒక అభ్యర్థి జెడ్పిటిసి అభ్యర్థిగా గెలిపించుకున్న సందర్భాలు ఉన్నాయని,రాజకీయ పార్టీలు, కాంగ్రెస్ పార్టీ,బిఆర్ఎస్ పార్టీ, సిపిఎం, సిపిఐ పార్టీలు, బిజెపి పార్టీ,బహుజన సమాజ్వాది పార్టీ కావచ్చు, ఇలా ఏ పార్టీ అయినా అత్యధిక జనాభా ఉన్న ఓడబలిజ కులస్తులకు టిక్కెట్ ఇస్తున్నట్లయితే గెలిపించే బాధ్యత ఓడబలిజ కులస్తులదేనని, లేనియెడల ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోయిన, ఇండిపెండెంట్ గా ఓడ బలిజ సేవా సంఘం తరఫున నామినేషన్ వేయడానికైనా వెనకాడబోమని ఓడబలిజ కులస్తుల అభ్యర్థిని గెలిపించుకుంటామని తెలియజేశారు. జెడ్పిటిసి, ఎంపీటీసీ,స్థానాల్లో బీసీ జనరల్ వచ్చినా సందర్భంగా ఎక్కడెక్కడ అయితే బీసీ అవకాశం వచ్చిందో అక్కడ ఓడబలిజ సోదరులను నిలబెట్టాలని అన్నార. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య, మండల అధ్యక్షులు గార నాగార్జున రావు, అధికార ప్రతినిధి బోల్లె ఆదినారాయణ ,ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గార తిరుపతి, మాజీ ఉప సర్పంచ్లు బొల్లె బాబు, బోల్లె సూర్యం ,లెనిన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బస్ ఛార్జీల పెంపుకి నిరసన తెలిపే బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ గవర్నమెంట్ బస్ చార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపి, మహిళలకు ఫ్రీ బస్ పెట్టినట్టు పెట్టి ఆ ఆదాయాన్ని బస్ లో ప్రయాణం చేస్తున్న మగవాళ్ళ మీద భారం వేస్తూ చార్జీలను పెంచిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చర్యల ను ఎండగడుతూ గురువారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టి ఆర్ పిలుపు మేరకు బస్ భవన్ ముట్టడి సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆ నిరసన తెలిపే కార్యక్రమం కు వెళ్లకుండా ముంధస్తుగా తెల్లవారుజామున 5 గంటలకే ఇంటికి వచ్చి పోలీస్ లు హౌస్ అరెస్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ప్రెసిడెంట్, సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు, జనార్ధన్ గౌడ్, బాబూ మోహన్ మల్లేష్ తదితరులను మియాపూర్ స్టేషన్ కు తరలించి రిమాండ్ లో కీ తీసుకుని సాయంత్రం వదలి పెట్టారు.



### సగర సంఘం కమ్యూనిటీ హాల్

## నిర్మాణం కొరకు ఎమ్మెల్యేకు వినతి

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** హాఫిజ్ పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీ కి చెందిన సగర(ఉప్పర) సంఘం వాసులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు అసోసియేషన్ సభ్యులు సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది. దీనిపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించడం జరిగినది. ఈ సందర్భంగా ప్రకాష్ నగర్ కాలనీ కి చెందిన సగర (ఉప్పర) సంఘం సభ్యులు మాట్లాడుతూ... హాఫిజ్ పేట్ పరిసర ప్రాంతంలో 300 కుటుంబాలకు పైగా సగరులము నివాసిసతున్నాం. మాకు అందరికి ఉపయోగపడే విధంగా అందరికి ఆమోదయోగ్యమైన కమ్యూనిటీ హాల్ ను నిర్మించుకుంటామని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోరుకు తమ వంతు సహాయ సహకారాలు అందిచాలని పీఏసీ చైర్మన్ గాంధీ కి వినతి పత్రం ద్వారా కాలనీ సగర సంఘం వాసులు కోరడం జరిగినది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ప్రకాష్ నగర్ కాలనీ కి చెందిన సగర(ఉప్పర) సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని , కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని, అందరికి ఉపయోగపడే విధంగా అందరికి ఆమోదయోగ్యమైన కమ్యూనిటీ హాల్ ను నిర్మించుకోవడానికి ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయం అని , కమ్యూనిటీ హాల్ ను సగర సంఘం సంక్షేమం, అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు , జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం ఉపయోగపడుతుంది అని, సగరుల అభివృద్ధికి విశేషంగాపకృషి చేస్తానని, కమ్యూనిటీ హాల్ కోసం నిధులు కేటాయించడానికి సిద్ధం అని, ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని గాంధీ తెలియచేసారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. నిరంతరం తాను నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి పెడతానని అందులో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నానని పిఎసి పీఏసీ చైర్మన్ గాంధీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, సగర ( ఉప్పర) సంఘం అధ్యక్షులు వెంకట్రాములు సాగర్, గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ సాగర్, తిరుపతయ్య సాగర్, రంగయ్య సాగర్, సలహాదారులు అంపయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సాయి బాబా సాగర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సాగర్, శివ సాగర్, సహాయ కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి మందాడి నారాయణ, సంయుక్త కార్యదర్శులు రాజు సాగర్, అనిల్ సాగర్, ప్రచార కార్యదర్శులు సాయిరాం, నర్సింలు, శ్రీధర్, మారుతి సాగర్, రాజు, నాగరాజు పాల్గొన్నారు.



## అనంతగిరి పాలియాటివ్ కేర్ సెంటర్‌ను
# వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలింపు
### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని అనంతగిరి గుట్టపై ఉన్న పాలియాటివ్ కేర్ సెంటర్ ను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం కొరకు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి తో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పవిత్ర సమావేశమయ్యారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర అనంతగిరి గుట్టపై ఉన్న పాలియాటివ్ కేర్ సెంటర్ ను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోకి తరలించడం గురించి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మితో చర్చించి తరలింపునకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పాలియేటివ్ కేర్ సెంటర్ (ఆలన)అనంతగిరి గుట్టలో వికారాబాద్ పట్టణానికి దూరంగా ఉండడం వలన వచ్చిపోయే రోగులకు కూడా సౌకర్య వంతంగా లేకపోవడం వలన కలెక్టర్ ఆదేశం మేరకు తరలింపు నిర్ణయం తీసుకున్నామని, ఈ తరలింపు వలన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, వృద్ధాప్య సమస్యలతో ఉన్నవారికి అందుబాటులో ఉండడం వలన మరింత సేవ చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. పాలేటివ్ కేర్ సెంటర్ ను తరలించడానికి ఏర్పాట్లు చేసుకోని రెండు మూడు రోజులలో షిఫ్ట్ కావాలని వైద్యాధికారి సిబ్బందిని ఆదేశించారు.



## ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రోడ్లు
# వెంటనే బాగు చేయాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లాలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్లను వెంటనే బాగు చేయాలని సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ పాల్గొని మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో మన్నెగూడ నుండి తాండూర్, బషీరాబాద్, వికారాబాద్ నుంచి మర్పల్లి మోమిన్ పేట్, వికారాబాద్ నుండి కోటిపల్లి బంటారం తోర్మామిడి, జిల్లా పరిధిలోని ఆయా గ్రామాలకు, వికారాబాద్ నుండి జైదూ పల్లి మోమిన్ కాలాన్, నాగారం, యాలాల్, బొంరాస్పేట్, వికారాబాద్ నుండి నవాబుపేట్ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్ అండ్ రోడ్లు గత 20 ఏళ్లుగా గుంతలమయం అయి చాలా అద్వానంగా తయారైనవి ప్రయాణికులు అనేకమంది ఇప్పటికే యాక్సిడెంట్లుతో చనిపోయిన పరిస్థితి జిల్లాలో నేటికి ఘటనలు అనేకం కనిపిస్తా ఉన్నాయన్నరు. ఇప్పటికే అనేకసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన దున్నపోతు మీద వాన పడ్డట్లుగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా వికారాబాద్ ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సీఎం, పరిగి తాండూర్ ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి పాడైన రోడ్లను వెంటనే బాగు చేయించాలని రోడ్ ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాల కొనసాగిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సభ్యులు సుదర్శన్, సతీష్, నవీన్, నాయకులు అక్బర్, లక్ష్మయ్య, ప్రశాంత్, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# 'సిందూర్' దెబ్బకు మసూద్ అజార్ కొత్త కుట్రలు
### జైషే మహిళా బ్రిగేడ్

**న్యూఢిల్లీ :** పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'తో జైషే మహ్మద్ ఉగ్రముఠా కకావికలమైన సంగతి తెలిసిందే. ఈ ఊహించని దెబ్బ నుంచి కోలుకునేందుకు ప్రయత్నిస్తోన్న మసూద్ అజార్ ముఠా కొత్త పన్నాగాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటుచేసినట్లు సమాచారం. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 'జమాత్ ఉల్ మామినాత్' పేరుతో ఈ స్పెషల్ బ్రిగేడ్‌ను జైషే ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే బహవల్‌పూర్‌లోని జైషే కేంద్రంలో నియామకాలు ప్రారంభించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ కొత్త యూనిట్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహించనుందట. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని ఈ జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో జైషే కేంద్రం దారుణంగా ధ్వంసమవడమే గాక.. మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని ఇటీవల జైషే కమాండర్ కూడా ధ్రువీకరించాడు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. ఇక, ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలను సభ్యులుగా తీసుకుంటున్నట్లు సమాచారం. వీరితో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను నియమించుకోనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐసిస్, బోకో హరామ్, హమాస్ వంటి ఉగ్ర ముఠాలు మహిళలను నియమించుకొని వారిని ఆత్మాహుతి దాడులకు ఉపయోగించుకున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పుడు జైషే కూడా ఆ పంథానే అనుసరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించినట్లు సదరు మీడియా కథనాలు పేర్కొన్నాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయట. దీంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# ప్రధాని మోదీ- కీర్ స్టార్మర్ భేటీ



**న్యూఢిల్లీ :** రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ముంబయిలో ప్రధాని మోదీ-స్టార్మర్ భేటీ అయ్యారు. ఈ సమావేశం కోసం రాజ్‌భవన్‌కు వచ్చిన యూకే ప్రధానిని మోదీ స్వాగతించారు. దీనికి సంబంధించిన చిత్రాలను విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. రెండు దేశాల మధ్య బలమైన సంబంధాల కోసం కలసికట్టుగా అని రాసుకొచ్చారు. జులైలో భారత్-బ్రిటన్ మధ్య 'స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం' (ఎఫ్‌టీఏ) కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం అవుతుందని అప్పట్లో ఇరుదేశాలు ప్రకటించాయి. ఈ ఒప్పందం నేపథ్యంలోనే 125 మంది ప్రతినిధుల బృందంతో స్టార్మర్ భారత్‌కు వచ్చారు. 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతున్న భారత్‌తో బ్రిటన్ ఒప్పందం.. పురోభివృద్ధికి లాంచ్‌పాడ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐరోపా సమాఖ్య(ఈయూ) నుంచి తాము వైదొలిగిన తర్వాత భారత్‌తో కుదిరిన ఒప్పందం కీలకమైందన్నారు. బ్రిటన్ ఎగుమతి చేస్తున్న ఉత్పత్తులపై భారత్ సగటు టారిఫ్ 15% నుంచి 3 శాతానికి తగ్గనుందని యూకే ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. ద్వైపాక్షిక బంధాలను మరింత విస్తృతం చేయడంపై తాజాగా మోదీ-స్టార్మర్ చర్చలు జరుపుతున్నారు.

# జెండా సంగతేంటి..?
### అఫ్గాన్ మంత్రి పర్యటన వేళ భారత్ డైలమా



**న్యూఢిల్లీ :** తాలిబన్ ఆక్రమణలో ఉన్న అఫ్గానిస్థాన్ నుంచి విదేశాంగమంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ తొలిసారి భారత్‌లో అడుగుపెట్టారు. వారం రోజులపాటు పలు భేటీల్లో పాల్గొన నున్నారు. ఇక్కడే భారత్‌కు ఒక చిక్కొచ్చిపడింది. ఇంతకీ విషయం ఏంటంటే..? భారత్‌కు వచ్చిన అఫ్గాన్ మంత్రి భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, ఎన్ఎస్ఏ అజిత్ ఢోబాల్‌తో చర్చలు జరపనున్నారు. దౌత్యపరమైన ప్రొటోకాల్ ప్రకారం.. మన త్రివర్ణ పతాకంతో పాటు సందర్శనకు వచ్చిన నేత దేశానికి చెందిన జెండాను వారి వెనక లేక టేబుల్‌పై ఉంచాలి. ఇక్కడే అధికారులు డైలమాలో పడ్డారు. ఆ ప్రభుత్వాన్ని భారత్ గుర్తించలేదు. అలాగే జెండాను కూడా. దిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయంపై తమ జెండాను ఎగురవేయడానికి మన ప్రభుత్వం అనుమతించలేదు. ఇప్పటికీ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్గానిస్థాన్ జెండానే అక్కడ ఎగురుతోంది. ఇటీవల ముత్తాఖీ, భారత అధికారుల మధ్య కాబుల్‌లో సమావేశం జరిగింది. అప్పుడు వెనకవైపు తాలిబన్ జెండాను ఉపయోగించారు. మరోసారి దుబాయ్‌లో విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్త్రీ, ముత్తాఖీ భేటీ అయ్యారు. అప్పుడు ఎవరి జెండా పెట్టకుండా చర్చలు జరిపారు. కానీ ఈసారి వేదిక భారత్. ఇది అధికారులకు దౌత్యపరమైన సవాల్‌గా మారింది. ఇప్పుడు అఫ్గాన్‌కు చెందిన పాత, కొత్త జెండాలలో దేనినైనా ఉపయోగిస్తారా..?లేక అసలు జెండాలు లేకుండానే సమావేశాలు నిర్వహిస్తారా..? అన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య సుదీర్ఘకాల స్నేహ బంధం ఉంది. అయితే 2021లో తాలిబన్ల ఆక్రమణ తర్వాత కాబుల్‌లో భారత్ తన ఎంబసీని మూసివేసింది. అయితే వైద్య, మానవతాసహాయం, వాణిజ్యం కోసం ఏడాది తర్వాత ఒక చిన్నపాటి దౌత్యమిషన్‌ను తెరిచింది. అక్కడి ప్రభుత్వాన్ని గుర్తించకపోయినా.. అఫ్గాన్‌లో అధికారంలో ఉన్నవారితో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు పలు చర్యలు తీసుకుంటోంది. అలాగే అఫ్గాన్ గడ్డను ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకుండా చూడాలని ఐరాస వేదికగా పిలుపునిచ్చింది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. భారత్ ప్రయోగించిన ఓ క్షిపణి అఫ్గాన్ భూభాగంలో పడినట్లు పాక్ చేసిన తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టింది. ఆ క్రమంలోనే ముత్తాఖీతో.. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఫోన్‌లో మాట్లాడిన సంగతి తెలిసిందే.

# 'వాళ్ల పేర్లు ఉన్నాయనే ఎఫ్ఐఆర్ నమోదు చేయట్లేదు'
### ఐపీఎస్ అధికారి ఆత్మహత్య కేసులో భార్య ఆరోపణలు



**న్యూఢిల్లీ :** హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ రివాల్వర్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం సృష్టిస్తోంది. ఆయన సతీమణి సీఎంకు రాసిన లేఖలో సంచలన ఆరోపణలు చేశారు. 8 పేజీల్లో సూసైడ్ నోట్ లభించినా, ఫిర్యాదు చేసినా.. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పేర్కొన్నారు. ఆయన సూసైడ్ నోట్‌లో ఉన్నతాధికారుల వేధింపులు, అవమానాల గురించి పేర్కొన్నప్పటికీ వాటిని చండీగఢ్ పోలీసులు విస్మరించారని ఆరోపించారు. "హరియాణా పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉండటం, వారు చండీగఢ్ పోలీసుల్ని ప్రభావితం చేయడమే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణం" అని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. "ఈ ఉన్నతాధికారులు నాతో పాటు నాకుటుంబంపై బురదజల్లే ప్రయత్నం చేయొచ్చు. శాఖాపరంగా నన్ను ఇరికించే ప్రయత్నాలు చేయొచ్చు. నా భర్త మరణానికి కారణమైన వారినుంచి నాకు బెదిరింపులు ఎదురవుతున్నాయి" అని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమయంలో తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కేసులో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సాక్ష్యాలు తారుమారు కాకుండా, విచారణలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకు బాధ్యులను సస్పెండ్ చేయాలని అభ్యర్థించారు. అలాగే చండీగఢ్‌లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు కూడా ఓ లేఖ రాశారు. హరియాణా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శత్రుజీత్ సింగ్ కపూర్, ఇతర అధికారులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పేర్కొన్నారు. తన భర్త కులవివక్ష ఎదుర్కొన్నారని వాపోయారు. మంగళవారం చండీగఢ్‌లో తన నివాసంలో పూరన్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన మృతదేహాన్ని బేస్‌మెంట్‌లో కనుగొన్నారు. ఆయన భార్య అమ్నీత్ పి కుమార్ ఐఏఎస్ అధికారిణి. ఆ సమయంలో ఆమె విదేశీ పర్యటనలో ఉన్నారు. సీఎంతో కలిసి అధికార పర్యటనలో భాగంగా జపాన్ వెళ్లారు. 2001 ఐపీఎస్ బ్యాచ్ హరియాణా క్యాడర్‌కు చెందిన 52 ఏళ్ల పూరన్ కుమార్ స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇటీవల ఆయన అధికారుల హక్కుల గురించి మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆయనను పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఐజీగా బదిలీ చేశారు.

# ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగం : తేజస్వీ యాదవ్



**బిహార్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల నేతలు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో తాము (ఇండియా కూటమి) అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. పట్నాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపే ఇందుకు సంబంధించి ప్రతిపాదిత చట్టాన్ని తీసుకువస్తామని అన్నారు. "20 ఏళ్లలో రాష్ట్ర యువతకు ఎన్డీయే ఉద్యోగాలు కల్పించలేకపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే చట్టాన్ని తీసుకువస్తాం. 20 నెలల్లోనే దీన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ప్రభుత్వ ఉద్యోగాలపై హామీ ఇచ్చాను. నేను అధికారంలో ఉన్న ఆ కొద్ది కాలంలోనే ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించా. నాకు ఐదేళ్ల సమయం ఉంటే ఎన్ని ఉద్యోగాలు ఇస్తానో మీరే ఊహించుకోవచ్చు" అని బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ను కాపీక్యాట్ అంటూ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం కొన్ని నెలలుగా చేపడుతున్న కార్యక్రమాలు గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను పోలిఉన్నాయని ఆరోపించారు.



# 'ముందు మేం షాకయ్యాం'..
### దాడికి యత్నం ఘటనపై సీజేఐ గవాయ్

**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడికి యత్నించిన ఘటన ఇటీవల కలకలం రేపింది. దీన్ని పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. తాజాగా దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ స్పం దించారు. ఆ ఘటనతో తొలుత తాను షాకయ్యానని తెలిపారు. ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన ప్రస్తావనకు వచ్చింది. దీని పై సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లా డుతూ.. "సోమవారం నాటి ఘటనతో నేను, సహచర జడ్జి షాక్ అయ్యాం. అయితే, మా వరకు అది ఒక మర్చిపోయిన అధ్యాయం" అని అన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పందిస్తూ.. "సీజేఐపై దాడికి యత్నించడాన్ని జోక్‌గా తీసుకోవద్దు. ఇది సుప్రీంకోర్టును అవమానించడమే. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందే" అని అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఈ ఘటన క్షమార్హం కాదన్నారు. దీన్ని మర్చి పోయిన అధ్యాయం అనడం సీజేఐ గొప్పతనమని కొనియాడారు. అక్టోబరు 6న ఈ ఘటన చోటుచేసుకుంది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం కోర్టు నం.1లో వాజ్యాలపై విచారణను కొనసా గిస్తుండగా రాకేశ్ కిశోర్ (71) అనే న్యాయవాది వేదిక వద్దకు వచ్చారు.వెంటనే తన కాలికున్న బూటును తీసి విసరబోతుండగా భద్రతా సిబ్బంది అడ్డుకుని అతనిని బయటకు తరలించారు. ఈసమయంలో ఆ న్యాయవాది.. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అని నినదించడం వినిపించింది. దాడి సమయంలో జస్టిస్ గవాయ్ మనోనిబ్బరంతో కనిపించారు. 'ఇలాంటి బెదిరింపులు నా దృష్టిని మళ్లించలేవు. పనితీరును ప్రభావితం చేయలేవు' అని కోర్టు హాలులో ఉన్న న్యాయవాదులతో ఆయన అన్నారు.

# సీజేఐపై దాడికి యత్నం..
### ఆ లాయర్‌కు సుప్రీంకోర్టులోకి ప్రవేశం రద్దు

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ చర్యలు ప్రారంభించింది. రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతోపాటు న్యాయస్థానం ప్రాంగణంలోకి కూడా ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇలాంటి అస్థిరమైన ప్రవర్తన కోర్టు అధికారికి పూర్తిగా తగదని, వృత్తిపరమైన నీతిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. సుప్రీంకోర్టు గౌరవాన్ని కూడా కాలరాయడమేనని తెలిపింది. న్యాయవాది రాకేశ్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై.. పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. కాగా.. ఘటన నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రాకేశ్ కిశోర్ లాయర్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై లాయర్ కిశోర్ తన కాలి బూటుతో దాడికి యత్నించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాన్ని అడ్డుకొని ఆయన్ను బయటకు తరలించారు. ఈ క్రమంలో ఆయన 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. ఈ ఘటనను ప్రధాని మోదీతో సహా పలు రాజకీయ పార్టీల అగ్రనేతలు, న్యాయవాదుల సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.



## ట్రంప్ ఎఫెక్ట్.. ఐరాస శాంతి పరిరక్షక దళం
# 25శాతం కుదింపు

**యూఎస్ :** రెండోసారి అధికారం చేపట్టిన అనంతరం ట్రంప్ పలు సంస్థలకు ఇచ్చే నిధుల్లో కోత విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం తాజాగా ఐక్యరాజ్యసమితిపైనా పడింది. పలు సంక్షోభ ప్రాంతాల్లో ఉన్న తమ శాంతి పరిరక్షకులను కుదించి తిరిగి వెనక్కి రప్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రైవేటు సమావేశంలో చర్చ అనంతరం ఐరాస సీనియర్ అధికారి ఒకరు విలేకరులతో ఈ విషయాన్ని వెల్లడించారు. యూఎన్‌కు పెద్ద మొత్తంలో నిధులు అందించే దేశం అమెరికా. అయితే, ట్రంప్ అమెరికా ఫస్ట్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాంతి పరిరక్షక దళాల నుంచి 25 శాతం తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. తొమ్మిది మిషన్‌లలో భాగంగా 50వేల కంటే ఎక్కువమంది శాంతి పరిరక్షకులను ఐరాస మోహరించింది. తాజా కోతల నేపథ్యంలో 13 నుంచి 14వేల మంది సైనిక, పోలీసు సిబ్బందిని వెనక్కి రప్పించనుంది. సోమాలియాలోని యూఎన్ సహాయ కార్యాలయంపై కూడా దీని ప్రభావం పడనుంది. వచ్చే ఏడాది శాంతి పరిరక్షణ దళానికి అందించే 5.4 బిలియన్ డాలర్ల బడ్జెట్‌లో కూడా 15 శాతం తగ్గించాలని యూఎన్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దక్షిణ సూడాన్, లెబనాన్, సైప్రస్, కొసావో వంటి దేశాల్లో యూఎన్ శాంతి పరిరక్షక కార్యకలాపాలు సాగుతున్నాయి. యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, అమెరికా రాయబారి మైక్‌వాల్జ్‌తో సహా మరికొంత మందితో ఇటీవల జరిగిన సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శాంతి పరిరక్షక ప్రయత్నాలకు 680 మిలియన్ డాలర్లు యూఎన్‌కు ఇచ్చేందుకు అమెరికా అంగీకరించింది. గతంలో వాషింగ్టన్ అందించిన దానికంటే ఇది చాలా తక్కువని యూఎన్ అధికారి తెలిపారు.

# టీసీఎస్ లాభం రూ.12,075 కోట్లు..

## ఒక్కో షేరుపై రూ.11 డివిడెండ్




**ఢిల్లీ:** టాటా గ్రూప్‌నకు చెందిన ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. టీసీఎస్ ఫలితాలతో టెక్ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జులై- సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.12,075 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంతో పోలిస్తే 1.39 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది రెండో త్రైమాసికంలో కంపెనీ రూ.11,909 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. నిర్వహణ లాభం 2.39 శాతం పెరిగి 65,799 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఆదాయం 64,259 కోట్లు. ఇంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే లాభం 5.3 శాతం తగ్గగా.. ఆదాయం 3.7 శాతం పెరిగింది. త్రైమాసిక ఫలితాల సందర్భంగా కంపెనీ ఒక్కో షేరుకు రూ.11 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో గురువారం కంపెనీ షేరు విలువ బీఎస్ఈలో రూ.3,061.95 వద్ద ముగిసింది. అంటే క్రితం ముగింపుతో పోలిస్తే 1.16 శాతం పెరిగింది.






## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్


దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఫార్మా, ఆయిల్ గ్యాస్, రియాల్టీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ ఐటీ షేర్లు రాణించాయి. సెన్సెక్స్ 390 పాయింట్లకు పైగా పెరగ్గా.. నిఫ్టీ 120 పాయింట్లకు పైగా పెరిగింది. ఉదయం 81,900.00 (క్రితం ముగింపు 81,773.66) వద్ద ప్రారంభమైన సూచీ ఒక దశలో 81,667.68 కనిష్ఠానికి పడిపోయింది. ఆ తర్వాత పుంజుకొని 398.45 పాయింట్లు లాభపడి చివరకు 82,172.10 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ 122.80 పాయింట్లు పెరిగి 25,168.95 వద్ద స్థిరపడింది. రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 88.79 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యు స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభాల్లో ముగియగా.. యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్ కంపెనీ, టాటా కన్స్యూమర్, మారుతి సుజుకి నష్టపోయాయి.




## భారత్- యూకే మధ్య మరిన్ని ఇండిగో సర్వీసులు

భారత్- యూకేల మధ్య విమాన సర్వీసులను పెంచేందుకు ఇండిగో సిద్ధమైంది. దిల్లీ, ముంబయి నుంచి మాంచెస్టర్‌కు త్వరలో మరిన్ని సర్వీసులు ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇటీవల ముంబయి నుంచి మాంచెస్టర్‌కు ప్రత్యక్ష విమాన సర్వీసులను ఇండిగో ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనికి మంచి స్పందన రావడంతో తాజాగా దిల్లీ నుంచి మాంచెస్టర్‌కు ప్రత్యక్ష విమాన సర్వీసులను ప్రారంభించాలని నిర్ణయించింది. ఇవి నవంబరు 15 నుంచి అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు.. ముంబయి నుంచి లండన్‌లోని హీత్రూకు వెళ్లే డైరెక్ట్ విమానాలు ఈనెల 26 నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపింది.

## ఆసియా క్రికెట్ చరిత్రలోనే తొలి బౌలర్‌గా
# రషీద్ ఖాన్ రికార్డు




భారత క్రికెట్ అభిమానులకూ సుపరిచితుడు రషీద్ ఖాన్ అద్భుతమైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. అఫ్గానిస్థాన్‌కు చెందిన ఈ బౌలర్ ఆసియా క్రికెట్ చరిత్రలో సూపర్ రికార్డు సాధించాడు. ఇప్పటివరకు ఏ బౌలర్‌కు సాధ్యం కాని ఘనత అది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తొలి ఆసియా బౌలర్‌గా నిలిచాడు. తాజాగా బంగ్లాదేశ్‌తో అఫ్గానిస్థాన్ వన్డే సిరీస్ ఆడుతోంది. తొలి వన్డేలో అఫ్గాన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ మూడు వికెట్లు తీశాడు. దీంతో వన్డే ఫార్మాట్‌లో 200ం వికెట్లు తీసిన తొలి అఫ్గాన్ బౌలర్‌గా నిలిచాడు. కేవలం 115 మ్యాచుల్లోనే ఈ ఘనత సాధించాడు. అతడి తర్వాత మహ్మద్ నబీ (174 మ్యాచుల్లో 176 వికెట్లు) ఉన్నాడు. ఆసియా క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకూ ఎవరూ నమోదుచేయని ఓ ఘనతను రషీద్ సాధించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అంటే వన్డేలు, టీ20లు. ఈ ఫార్మాట్లలో 200ం వికెట్లు, 150ం వికెట్లు తీసిన ఏకైక బౌలర్ రషీద్ ఖాన్. ఇటు ఐపీఎల్‌లోనూ 150ం వికెట్లు పడగొట్టడం గమనార్హం. అంతర్జాతీయ టీ20ల్లో 179 వికెట్లు, ఐపీఎల్‌లో 158 వికెట్లు తీశాడు.

### బంగ్లాపై అద్భుత విజయం..

అబుదాబీ వేదికగా అఫ్గానిస్థాన్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి వన్డే జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా 48.5 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ (60), తౌహిద్ హృదోయ్ (56) హాఫ్ సెంచరీలు చేశారు. రషీద్ 3, అజ్మతుల్లా 3, ఘజన్‌ఫర్ 2, ఖరోటె 1 వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఓపెనర్ రహ్మతుల్లా గుర్బాజ్ (50), రహ్మత్ షా (50) అర్ధశతకాలతోపాటు అజ్మతుల్లా ఒమర్జాయ్ (40), హష్మతుల్లా షాహిది (33లి) రాణించారు. దీంతో 47.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయిన అఫ్గాన్ 226 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో అఫ్గాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.




## నా అవసరం ఉందనుకోవాలి

### మార్పును ఎవరైనా అంగీకరించాల్సిందే : షమీ

భారత సీనియర్ బౌలర్ మహ్మద్ షమీ కెరీర్ ఇప్పుడు డోలాయమానంలో పడింది. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఫిట్‌నెస్ సమస్యను ఎదుర్కొన్న అతడు జట్టుకు దూరమయ్యాడు. ఇటీవల దేశవాళీలో ఆడి తన అదృష్టాన్ని పరీక్షించుకొన్నాడు. కానీ, ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక అవుతాడని చాలామంది ఊహించారు. బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాత్రం అవకాశం కల్పించలేదు. దీంతో అతడి కెరీర్ దాదాపు ముగిసినట్లేనని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. షమీ మాత్రం రంజీల్లో ఆడి మళ్లీ జాతీయజట్టులోకి వస్తానని ధీమా వ్యక్తంచేశాడు. ఎందుకు ఎంపిక కాలేదని తన సమాధానం కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారని షమీ వ్యాఖ్యానించాడు. "నాపై సోషల్ మీడియాలో రూమర్లు, మీమ్స్ చాలా వచ్చాయి. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక కాకపోవడంపై నా అభిప్రాయం చెప్పాలని అభిమానులు కోరుకున్నారు. ఈ సందర్భంగా ఒక్క మాట చెబుతున్నా. జట్టుకు ఎంపిక చేయడమనేది నా చేతుల్లో ఉండదు. అది సెలక్షన్ కమిటీ బాధ్యత. కోచ్, కెప్టెన్‌కు నా అవసరం ఉందనిపించాలి. వారే నన్ను ఎంపిక చేయాలి. ఇంకాస్త సమయం కావాలని వారు భావిస్తే.. అందుకోసం నేను సన్నద్ధంగానే ఉంటా" అని షమీ తెలిపాడు.

**ఫిట్‌నెస్ బాగుంది..** ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు జట్టును ప్రకటించేటప్పుడు సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్‌కు ఓ ప్రశ్న ఎదురైంది. షమీ 'ఫిట్‌నెస్' ఎలా ఉందని ప్రశ్నించగా.. తమకు సరైన సమాచారం లేదంటూ వ్యాఖ్యానించాడు. ఆ వ్యాఖ్యలపై షమీ స్పందిస్తూ " నా ఫిట్‌సెన్ చాలా బాగుంది. మైదానానికి దూరంగా ఉన్నప్పుడు మనకు మనమే స్ఫూర్తి పొందాలి. నేను దులీప్ ట్రోఫీలో ఆడా. చాలా సౌకర్యంగా అనిపించింది. బౌలింగ్ లయ కూడా బాగుంది. దాదాపు 35 ఓవర్లపాటు బౌలింగ్ చేశా. నాకెక్కడా సమస్యగా అనిపించలేదు" అని షమీ వెల్లడించాడు.

**మనం అంగీకరించాల్సిందే..** "మీరు నన్ను అడిగిన ప్రశ్నకు చాలా మీమ్స్ వచ్చాయి. ఇందులో నాకెలాంటి అభ్యంతరం, పొరపాటు కనిపించలేదు. బీసీసీఐ, సెలక్టర్లు, కోచ్‌లు తీసుకున్న నిర్ణయం. శుభ్‌మన్ ఇప్పటికే ఇంగ్లాండ్ పర్యటనలో కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను నడిపిస్తున్నాడు. అతడికి మంచి అనుభవం ఉంది. ఎవరో ఒకరికి బాధ్యతలు అప్పగించాల్సిందే. బీసీసీఐ శుభ్‌మన్ గిల్‌కు ఇచ్చింది. మనమంతా దానిని అంగీకరించాల్సిందే. కెప్టెన్సీ విషయంలో అనవసరమైన ప్రశ్నలు వేయక్కర్లేదు. ఇదేమీ మన చేతుల్లో ఉండదు. ఇవాళ ఒకరు ఉంటారు.. రేపు మరొకరు. ఇదంతా సహజంగా జరిగే ప్రక్రియ" అని షమీ తెలిపాడు.

# రోహిత్‌లా ప్రశాంతంగా ఉంటా

### కెప్టెన్ శుభ్‌మన్ గిల్



భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్ శర్మ స్నేహపూర్వక వాతావరణం సృష్టించాడని.. తానూ అదే కొనసాగిస్తానని వన్డే సారథిగా ఎంపికైన శుభ్‌మన్ గిల్ వ్యాఖ్యానించాడు. శుక్రవారం వెస్టిండీస్‌తో రెండో టెస్టు నేపథ్యంలో గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వన్డే సారథ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆస్ట్రేలియాతో అక్టోబర్ 19నుంచి వన్డే సిరీస్ మొదలవనుంది. "రోహిత్ శర్మ చాలా ప్రశాంతంగా ఉంటాడు. అతడు సారథిగా ఉంటూ జట్టులో నెలకొల్పిన స్నేహపూరిత వాతావరణాన్ని సారథిగా నేనూ కొనసాగిస్తా. చాలామంది బయట నుంచి రకరకాల మాటలు అంటుంటారు. రోహిత్, విరాట్ ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్నారు. వారిద్దరి భవితవ్యంపై ఊహాగానాలు వస్తున్నాయి. టీమ్ఇండియా కోసం ఎన్నో మ్యాచులు గెలిపించారు. వీరిద్దరూ అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లు. జట్టుకు వారు చాలా అవసరం. వచ్చే వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగా వారి సన్నద్ధత జరుగుతోంది" అని గిల్ వ్యాఖ్యానించాడు.

**ప్రతి మ్యాచ్‌లోనూ గెలిచేందుకు..**

మున్ముందు మూడు ఫార్మాట్లలోనూ గిల్‌కే సారథ్య బాధ్యతలు దక్కే అవకాశం ఉంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. "భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేం. నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. అయితే, నేనెప్పుడూ వర్తమానంలో ఉండేందుకే ఇష్టపడతా. అలాగే గతంలో ఏం సాధించాననేది అప్రస్తుతం. ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతోనే ముందుకుసాగుతాం. రాబోయే కొన్ని నెలలు మాకు చాలా ముఖ్యం" అని గిల్ తెలిపాడు.

# తుది జట్టులో మార్పులు ఉండవు

### భారత అసిస్టెంట్ కోచ్ రైన్ టెన్ దస్కతే



దిల్లీ మైదానం వేదికగా శుక్రవారం నుంచి వెస్టిండీస్‌తో భారత్ రెండో టెస్టు ఆడనుంది. తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన టీమ్ఇండియా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేందుకు సిద్ధమైంది. అయితే, వర్క్‌లోడ్ కారణంగా జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇస్తారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ టెస్టు ముగిసిన కొన్ని రోజులకే ఆసీస్ పర్యటన ఉంది. అయితే, తుది జట్టు విషయంలో ఏ మార్పులు ఉండవని భారత అసిస్టెంట్ కోచ్ రైన్ టెన్ దస్కతే స్పష్టంచేశాడు. బ్యాటింగ్‌తో పాటు స్పిన్‌కు పిచ్ అనుకూలించే అవకాశం ఉందని తెలిపాడు. "మేం కాంబినేషన్‌ను మార్చే అవకాశం లేదని చెబుతా. మాకు సుదీర్ఘ లక్ష్యాలు చాలా ఉన్నాయి. అందులోనూ స్వల్పకాలిక లక్ష్యాలు కూడా ఇమిడి ఉంటాయి. టీమ్ఇండియా కోసం మంచి సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను మెరుగుపర్చేందుకు చూస్తున్నాం. విదేశాలకు వెళ్లినప్పుడు చాలా ప్రయోజనం ఉంటుంది. గాయం నుంచి కోలుకొని వచ్చిన నితీశ్ కుమార్‌ను గత మ్యాచ్‌లో ఆడించాం. కానీ, అతడు గొప్పగా ఏమీ కనిపించలేదు. అందుకే, ఎక్కువ ఓవర్లు బౌలింగ్ వేయించలేదు. రెండో టెస్టులోనూ అతడికి అవకాశం ఇవ్వాలనుకుంటున్నాం. ఇదొక మంచి ఛాన్స్ అవుతుంది. మంచి సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అవుతాడని భావిస్తున్నాం. గత ఆసీస్ పర్యటనలో నితీశ్ అద్భుత ప్రదర్శన చేశాడు. బౌలర్ మాత్రమే కాకుండా మంచి బ్యాటర్ కూడానూ. అందుకే, రెండో టెస్టులోనూ మరోసారి అవకాశం ఇవ్వాలని నిర్ణయించాం జస్‌ప్రీత్ బుమ్రా విషయంలోనూ ఏ మార్పూ లేదు. అతడూ రెండో టెస్టులో ఆడే అవకాశాలే ఎక్కువ" అని దస్కతే వెల్లడించాడు.

## ఫోర్బ్స్ సంపన్నుల జాబితా..

### తొలిస్థానంలో ముకేశ్ అంబానీ



**న్యూఢిల్లీ :** దేశంలోని 100 మంది అగ్రగామి కుబేరుల జాబితాను ఫోర్బ్స్ గురువారం విడుదల చేసింది. ఈ జాబితాలో ముకేశ్ అంబానీ మరోసారి అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 105 బిలియన్ డాలర్లుగా ఉంది. అయితే గత ఏడాదితో పోలిస్తే 12 శాతం క్షీణించింది. 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానాన్ని సొంతం చేసుకున్నారు. 100 మంది దేశీయ కుబేరుల సంపద విలువ 2025లో 9 శాతం పడిపోయి, 1 ట్రిలియన్ డాలర్లకు చేరింది. బలహీన రూపాయి, అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు దోహదం చేశాయి. ఓపీ జిందాల్ గ్రూప్‌నకు చెందిన సావిత్రి జిందాల్ మూడో స్థానంలో ఉండగా, టెలికాం దిగ్గజం సునీల్ మిత్తల్ నాలుగు, టెక్ బిలియనీర్ శివ నాడార్ ఐదోస్థానంలో నిలిచారు. ఆయా సంస్థల షేర్ విలువలతో పాటు ఆయా వ్యక్తులు, కుటుంబాల నుంచి సేకరించిన ఆర్థిక సమాచారం, విశ్లేషకులు, స్టాక్ ఎక్స్ఛేంజీలు, నియంత్రణ సంస్థల నుంచి సేకరించిన వివరాలతో సంపద విలువను అంచనా వేసినట్లు ఫోర్బ్స్ తెలిపింది. ఇదిలాఉంటే.. రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలి కమ్యూనికేషన్ సంస్థ జియో పబ్లిక్ ఇష్యూకుకు రానుంది. 2026 తొలి అర్ధభాగంలో తాము ఐపీఓకు వస్తున్నట్లు రిలయన్స్ సీఎండీ ముకేశ్ అంబానీ వార్షిక సమావేశంలో ప్రకటించారు. పెట్టుబడిదారులకు ఇది అత్యంత విలువైన అవకాశమని వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపింది. మరోపక్క కృత్రిమమేధను విస్తృతంగా వినియోగంలోకి తెచ్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అనుబంధంగా 'రిలయన్స్ ఇంటెలిజెన్స్' ఏర్పాటు గురించి ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ క్లిన్‌చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు పలు అవకతవకలకు పాల్పడ్డారంటూ అదానీ, ఆయన గ్రూప్‌పై అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఎటువంటి ఆధారాలూ లభించలేదని వెల్లడించింది. దాంతో అదానీ సంస్థకు ఊరట లభించిన సంగతి తెలిసిందే.

## బీసీసీఐకి వ్యతిరేకంగా పిల్..

### ఢిల్లీ హైకోర్టు అసహనం




భారత క్రికెట్ బోర్డుకు చెందిన జట్టును 'టీమ్ ఇండియా' అని ప్రసార భారతి సంబోధించడం సరైంది కాదంటూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఇదంతా మీకు, మాకు సమయం వృథా అని పిటిషనర్‌తో దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. చీఫ్ జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు పిటిషన్‌ను తిరస్కరించింది. బీసీసీఐ ప్రైవేటు సంస్థ అని.. భారత ప్రభుత్వంతో దానికి సంబంధం లేదని న్యాయవాది రీపక్ కన్వాల్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. భారత జాతీయ క్రికెట్ జట్టు అని బీసీసీఐ సంబోధించడం వల్ల తప్పుడు ప్రభావం పడుతుందని అందులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రసార భారతి, ఆల్‌ఇండియా రేడియో వంటి వాటిల్లోనూ బీసీసీఐ టీమ్‌ను 'భారత జట్టు'గా పిలవడం సరైంది కాదని పిటిషనర్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రైవేటు సంస్థకు ఆర్థికపరమైన లబ్ధి చేకూరుతోందని అందులో తెలిపారు. అయితే, ఈ పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రపంచవ్యాప్తంగా క్రీడలకు సంబంధించి పద్ధతి ఎలా ఉందో మీకు తెలుసా? అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ రూల్స్‌పై మీకు అవగాహన ఉందా? ఆ కమిటీలపై కేంద్రం లేదా రాష్ట్రాల జోక్యం ఉండకూడదనేది వారి పాలసీ. కానీ, మీరు (పిటిషనర్) మాత్రం ప్రభుత్వ అధికారులు ఎంపిక చేసిన జట్టే భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాలని అంటున్నారు. అయితే, ఒలింపిక్ కమిటీ పాలసీపై మీకు అవగాహన ఉందా? గతంలో ఎప్పుడైనా క్రీడా సమాఖ్యల్లో ప్రభుత్వం కలుగజేసుకున్న సందర్భాలు ఉన్నాయా?" అని హైకోర్టు ఘాటుగా ప్రశ్నించింది.

# భారత్‌కు ఊరట..

## ఇప్పట్లో జనరిక్ ఔషధాలపై టారిఫ్‌లు లేనట్లే..



బ్రాండెడ్, పేటెంట్ ఔషధ దిగుమతులపై 100శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆ సమయంలో జనరిక్ ఔషధాల దిగుమతులపై ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాజాగా దీనిపై వైట్‌హౌస్ స్పందించింది. జనరిక్ ఔషధాలపై టారిఫ్‌లు విధించే ప్రణాళిక ఏదీ లేదని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు శ్వేత సౌధం వర్గాలను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రచురించింది. దీంతో ప్రస్తుతానికి భారత్‌కు ఊరట లభించినట్లయ్యింది. దేశ భద్రతను దృష్టిలోఉంచుకొని అమెరికాకు దిగుమతి అయ్యే బ్రాండెడ్, పేటెంట్ ఔషధాలపై 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ టారిఫ్‌లు అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ క్రమంలోనే జనరిక్ ఔషధాలపై సుంకాలు విధించే అంశంపై ట్రంప్ పాలసీ కౌన్సిల్‌లో చర్చ జరిగింది. జనరిక్ మందులకు టారిఫ్‌లు వేస్తే.. దానివల్ల దేశీయంగా ధరలు పెరగడమే గాక, ఔషధాల కొరత ఏర్పడుతుందని కౌన్సిల్ సభ్యులు వాదించారు. అంతేగాక, వాటిపై అధిక సుంకాలు వేసినా అమెరికాకు ఎలాంటి లాభం ఉండదని అభిప్రాయపడ్డాయి. దీంతో ట్రంప్ దీనిపై వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సెక్షన్ 232 కింద జనరిక్ మందులపై సుంకాల అంశం చర్చకు ట్రంప్ కార్యవర్గం సుముఖంగా లేదని శ్వేత సౌధం ప్రతినిధి కుష్ దేశాయ్ పేర్కొన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. ఈ పరిణామాలు భారత్‌కు ఊరట కలిగించేవే. అమెరికాకు మనదేశం నుంచి జనరిక్ ఔషధాలే అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో మనదేశం నుంచి 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.64 లక్షల కోట్ల) విలువైన మందులు వివిధ దేశాలకు ఎగుమతి అయ్యాయి. అందులో దాదాపు మూడో వంతు అమెరికాకే చేరాయి. మన ఔషధ పరిశ్రమకు అమెరికా ఎంత ముఖ్యమో ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అమెరికాకు చేరుతున్న జనరిక్ ఔషధాల్లో 47% వాటా భారత్‌దే. ఇప్పుడు దీనిపై టారిఫ్‌లు విధించే అంశాన్ని అగ్రరాజ్యం పక్కనబెట్టడంతో.. మన కంపెనీలకు ఉపశమనం లభించినట్లయ్యింది.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక




## శివానీ నాగారంపై ట్రోలింగ్

నిమాకు సాయి మార్తాండ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలోనిదే "కాత్యాయని" పాట. తక్కువ బడ్జెట్ తో వచ్చిన ఈ సినిమా, కోట్ల వర్షం కురిపించింది. సెప్టెంబర్ 5వ తేదీన రిలీజ్ అయిన ఈ సినిమా మంచి సక్సెస్ అందుకుంది. ఇప్పుడు ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కూడా అవుతోంది. దసరా కానుకగా అక్టోబర్ ఒకటో తేదీన ఓటీటీలో రిలీజ్ చేశారు. ఇందులో కూడా మంచి వ్యూస్ వస్తున్నాయి. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన శివానీ నాగారంపై ట్రోలింగ్ జరుగుతోంది. రెండు సినిమాలు హిట్ కాగానే అందాలు ఆరబోస్తోందని ఆమె ఫోటోలపై దారుణంగా బూతులు తిడుతూ రెచ్చిపోతున్నారు కొంతమంది. ముఖ్యంగా బ్లాక్ సారీలో తన నడుము, ఎద అందాలు కనిపించేలా మెరిసింది కాత్యాయని. దీంతో ఆమెపై దారుణంగా కామెంట్లు పెడుతున్నారు. రెండు సినిమాల్లో పాపులర్ కాగానే, గేట్లు మొత్తం తెరిచి అందాలను అరబోస్తోందని, ఇదెక్కడి రోగం అంటూ కొంతమంది మండిపడుతున్నారు. అందాలు ఆరబోయడం తగ్గించుకోవాలని సూచనలు చేస్తున్నారు. డబ్బుల కోసం అందాలను చూపించడం దారుణమని మరి కొంతమంది అంటున్నారు. ఛాన్సుల కోసం సినిమా హీరోయిన్లు ఇలానే చేస్తారని చురకలు అంటిస్తున్నారు.

## త్రివిక్రమ్ - వెంకీ కాంబో

### హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్





నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుండా కాస్త రూటు మార్చబోతున్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను ఎ÷లాన్ చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి. ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుండగా..మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రివిక్రమ్ మరోవైపు అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వచ్చే సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.

## భావోద్వేగాలతో కట్టిపడేస్తాడు... 'డ్యూడ్'

"హాస్యం పంచడమే కాదు... సినిమాలో ఆశ్చర్యపరిచే విషయాలూ చాలానే ఉన్నాయి" అంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'డ్యూడ్'. మమితా బైజు కథానాయిక. కీర్తీశ్వరన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకొస్తోంది. గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని ఆవిష్కరించారు. వేడుకని ఉద్దేశించి ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ "యువతరంతోపాటు, కుటుంబ ప్రేక్షకులూ ఇష్ట పడేలా ఉంటుందీ చిత్రం. ట్రైలర్‌లో లేని డ్రామా, భావోద్వేగాలు సినిమాలో ఉంటాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్, శరత్ కుమార్ పాల్గొన్నారు.



## బద్రీనాథ్‌తో 40 కోట్లు బొక్క: అల్లు అరవింద్






అల్లు అర్జున్ ఇప్పుడు ఐకాన్ స్టార్ గా ఇండియా రేంజ్ లో దూసుకుపోతున్నాడు. పుష్ప సినిమా తర్వాత ఆయనకు పాన్ ఇండియా మార్కెట్ బాగా పెరిగింది. వందల కోట్ల బిజినెస్ చేస్తోంది ఆయన సినిమా. అయితే ఈ స్థాయిలో బన్నీ సినిమాలు చేస్తుంటే.. ఆయన వల్ల అల్లు అరవింద్ 40 కోట్లు నష్టపోయాడు. బద్రీనాథ్ మూవీ విషయాన్ని అల్లు అరవింద్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. అల్లు అర్జున్ హీరోగా వివి వినాయక్ డైరెక్షన్లో వచ్చిన భారీ బడ్జెట్ మూవీ బద్రీనాథ్. అయితే ఈ సినిమాను ముందు అల్లు అరవింద్ రిజెక్ట్ చేశాడంట. కానీ అల్లు అర్జున్ ఇందులోని యాక్షన్ సీన్స్ కోసం పట్టుబట్టి మరి చేశాడు. ఈ సినిమా రిజల్ట్ ఎందుకో తేడా కొడుతుందని ముందు నుంచి అరవింద్ చెబుతూనే ఉన్నాడంట. సినిమాకు బడ్జెట్ అనుకున్న దానికంటే రెండింతలు ఎక్కువైంది. అప్పుడున్న బన్నీ మార్కెట్ కుమించి బడ్జెట్ అయింది. రిలీజ్ కి ముందు కూడా అరవింద్ కు ఈ సినిమా గురించి తేడాగానే ఉందని అనిపించింది. అనుకున్నట్టు గానే సినిమా డిజాస్టర్ అయింది. బడ్జెట్ భారీగా ఉండడంతో నష్టాలు ఎక్కువగానే వచ్చాయి. ఆ సినిమాకు ఎంత లేదన్న 40 కోట్ల వరకు నష్టాలు వచ్చాయని అల్లు అరవింద్ స్వయంగా తెలిపాడు. ఆ దెబ్బతోనే చాలా రోజులు పెద్ద సినిమాలు నిర్మించలేదని స్పష్టం చేశాడు. తిరిగి కోలుకోవడానికి కొంచెం టైం పట్టిందని.. కెరీర్ లో ఇలాంటి అనుభవాలు కూడా మంచివే అంటూ తెలిపాడు అరవింద్.



## అప్పట్లో రామ్‌గోపాల్ వర్మ అంటే ఎవరో తెలీదు

### శివ సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపిందన్న శేఖర్ కమ్ముల

ఇండస్ట్రీని శివ సినిమాకు ముందు తర్వాత అని చూడొచ్చని ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం శివ మరోసారి అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసందే. నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో తనకు తెలియదన్నారు. టాలీవుడ్ చరిత్రలో మలుపుతిప్పిన సినిమాగా గుర్తింపు పొందింది శివ. నాగార్జున హీరోగా, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపింది. 1989లో విడుదలైన ఈ సినిమా, సాంకేతికంగా, కథా పద్ధతిలో, మేకింగ్‌లో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. యాక్షన్ చిత్రాలకే కాదు, కాలేజీ డ్రామాలకు కూడా రియలిస్టిక్ టచ్ ఇచ్చిన మొదటి తెలుగు సినిమా ఇది అని సినీ అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు ఈ లెజెండరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 14న శివ రీరిలీజ్ అవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని గురించి తన భావాలను పంచుకున్నారు. 'అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో నాకు తెలియదు. కానీ శివ సినిమా చూశాక సినిమా అంటే ఏమిటో, దాన్ని ఎలా ఆలోచించాలో అర్థమైంది. ఆ సినిమా నా దృష్టి, నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది' అంటూ కమ్ముల పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఈ మాటలు ఆ సినిమాకు ఉన్న ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయి. రియలిస్టిక్ సినిమాలకు పేరుగాంచిన శేఖర్ కమ్ముల దృష్టిలో శివ కేవలం ఒక సినిమా కాదు, అది ఒక పాఠశాల లాంటిదట.

## మోహన్ లాల్ చిత్ర రికార్డులు బ్రేక్


### 300 కోట్లు వసూలు చేసని కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాస్తోంది కొత్తలోక: చాప్టర్ 1 కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 300 కోట్ల క్లబ్‌లో చేరినట్లు టాక్. విడుదలైన నెల రోజులకే ఓటీటీకి వచ్చేస్తున్న తరుణంలో కొత్తలోక మాత్రం ఇంకా థియేటర్‌లోనే ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. కల్యాణి ప్రియదర్శన్ కీలక పాత్రలో డొమినిక్ అరుణ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ విడుదలైన 40 రోజుల్లో రూ.300 కోట్లు వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ ఏడాది వచ్చిన ఎల్2: ఎంపురాన్ ఇప్పటివరకూ మలయాళంలో అత్యధిక వసూళ్లు (రూ.265.5 కోట్లు) రాబట్టిన చిత్రంగా ఉండేది. ఆ రికార్డును కొత్తలోక బద్దలు కొట్టింది. వీటి తర్వాత తుడురమ్ రూ.242 కోట్లతో మూడో స్థానంలో ఉంది. డొమినిక్ అరుణ్ కథను నమ్మి నటుడు దుల్కర్ సల్మాన్ పెద్ద సాహసం చేశాడు. కొత్తలోక నటీనటులు, సాంకేతిక వర్గంపై రూ.30 కోట్లు ఖర్చు చేయడం చూస్తే, దుల్కర్ ఆ కథను ఎంతగా నమ్మాడో అర్థమవుతుంది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్రబృందం కష్టపడింది. ఇప్పటివరకూ కల్యాణి ప్రియదర్శన్ నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా కథ, కథనాలు వైవిధ్యంగా ఉండటంతో కేవలం మౌత్ టాక్‌తోనే దూసుకుపోయింది. ఇప్పుడు ఏకంగా మలయాళ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇక ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడొస్తుందా? అని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబరు 20వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు లోక యూనివర్స్ కొనసాగుతుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఇందులోభాగంగా లోక: చాప్టర్2ను నిర్మాత దుల్కర్ సల్మాన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.



## ప్రేమంటే మూవీ నుంచి దోచావే పాట

ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ప్రేమంటే. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుమ కనకాల కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి దోచావే నన్నే నువ్విలా.. అనే పాటను విడుదల చేశారు. ఈమెలోడీ పాటకు శ్రీమణి లిరిక్స్ అందించారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com